
షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL 16448

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక




సంపుటి : 1 సంచిక : 234 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శనివారం 6 జూలై 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 234 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Saturday 8 july 2024 PAGES : 8 PRICE : 5/-

## జగన్ పాలనతో అమరావతి

# ఆకర్షణ తగ్గింది



- కేంద్ర మంత్రి పదవులపై ఢిల్లీలో సీఎం చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు
- వాజ్‌పేయి నేతృత్వంలో ఉన్నప్పుడు కూడా ఎలాంటి పదవులు ఆశించలేదు
- అప్పుడు 7 మంత్రి పదవులు తీసుకోవాలని కోరినా అంగీకరించలేదు
- ఎన్డీఏ పార్టీలతో సత్సంబంధాల కోసమే స్పీకర్ పదవికి మాత్రం అంగీకరించా
- కులగణన స్థానంలో నైపుణ్య గణన

**న్యూఢిల్లీ**

ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మీడియా చిట్ చాట్‌లో ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. కేంద్రం నుంచి ఎలాంటి పదవులు ఆశించ లేదని ఆయన చెప్పారు. గతంలో ఎన్డీఏ ప్రభుత్వం వాజ్‌పేయి నేతృత్వంలో ఉన్నప్పుడు కూడా ఎలాంటి పదవులు ఆశించలేదని, అప్పుడు 7 మంత్రి పదవులు తీసుకోవాలని కోరినా అంగీకరించలేదని వెల్లడించారు. ఎన్డీఏ పార్టీలతో సత్సంబంధాల కోసమే స్పీకర్ పదవికి మాత్రం అంగీకరించానని సీఎం పేర్కొన్నారు. ఇప్పుడు కూడా అదే తరహాలో ఎలాంటి పదవులు టీడీపీ నుంచి కోరలేదని, అయితే ఎన్డీఏ నుంచి ఆఫర్ చేసిన రెండు మంత్రి పదవులు మాత్రం తీసుకున్నామని వెల్లడించారు. కేంద్రం ఇచ్చిన మంత్రి పదవుల పట్ల సంతోషంగానే ఉన్నామని చంద్రబాబు క్లారిటీ ఇచ్చారు. గత ఐదేళ్ల జగన్ పాలనతో అమరావతిపై ఉన్న - మిగతా3లో



## కొత్తగా వచ్చే పారిశ్రామికవేత్తలతో

# ఫ్రెండ్లీగా ఉండండి

- నేడు ఉండవల్లిలోని తన నివాసంలో మంత్రి లోకేశ్ సమీక్ష
- హాజరైన ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ ఉన్నతాధికారులు
- కొత్తగా వచ్చే పారిశ్రామికవేత్తల్లో నమ్మకం కలిగించాలన్న లోకేశ్
- 2019కి ముందు ఉన్న ఇన్వెస్ట్ మెంట్స్ పోర్టల్ పునరుద్ధరించాలని ఆదేశం

**విజయవాడ**

ఏపీ ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ నేడు ఉండవల్లిలోని తన నివాసంలో కీలక సమీక్ష చేపట్టారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల ప్రస్తుత స్థితి, రాష్ట్రంలో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు గల అవకాశాలపై ఉన్నతాధికారులతో చర్చించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ఐటీ, ఎలక్ట్రానిక్స్ కంపెనీలతోపాటు కొత్తగా రావడానికి ఆసక్తి చూపే పారిశ్రామికవేత్తల్లో నమ్మకాన్ని పెంపొందించడానికి అధికారులు చర్యలు చేపట్టాలని - మిగతా3లో



# ఏపీలో హెల్త్ టూరిజంని అభివృద్ధి చేస్తాం

- టీటీడీ నిర్ణయించిన ధరల మేరకు భక్తులకు సరసమైన ధరలకే నాణ్యమైన ఆహారాన్ని అందజేస్తాం
- ఇప్పటికే తిరుమలలో మూడు హొటల్స్ ని నడుపుతున్నాం
- టూరిజం శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి హొటల్స్‌ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నం చేస్తాం
- పర్యాటక రంగాన్ని అభివృద్ధి చెయ్యడం ద్వారా రాష్ట్ర ఆదాయాన్ని కూడా పెంచుతాం


**తిరుమల**

నారాయణగిరి ఉద్యానవణం వద్ద ఏపీ టూరిజం శాఖ ఏర్పాటు చేసిన హొటల్‌ని మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. టీటీడీ నిర్ణయించిన ధరల మేరకు భక్తులకు సరసమైన ధరలకే నాణ్యమైన ఆహారాన్ని అందజేస్తామన్నారు. ఇప్పటికే తిరుమలలో మూడు హొటల్స్ ని నడుపుతున్నామన్నారు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి హొటల్స్‌ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. తిరుపతిలో టూరిజం శాఖకు చెందిన 30 ఎకరాల స్థలంలో కూడా త్వరలోనే అభివృద్ధి పనులను ప్రారంభిస్తామని కందుల దుర్గేష్ వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో టూరిజం శాఖ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చెయ్యడం ద్వారా రాష్ట్ర - మిగతా3లో

## విభజన అంశాలు ఇప్పటికైనా

# కొలిక్కి వచ్చేనా?

- నేడు ఇద్దరు సీఎంల భేటీ.. చర్చించే అంశాలు ఇవే..!
- ప్రధానంగా షెడ్యూల్ 9, 10లో ఉన్న సంస్థల విభజనపై చర్చించే అవకాశాలు
- సీఎంల భేటీకి ప్రగతి భవన్‌లో అధికారులు ఏర్పాట్లు
- విభజనకు సంబంధించి అపరిష్కృతంగా ఉన్న అంశాలపై వీరిద్దరూ భేటీ కావటం ఇదే తొలిసారి
- విభజనకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి





**హైదరాబాద్**

రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు రేవంత్‌రెడ్డి రేపు(శనివారం) ప్రజా భవన్ వేదికగా సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో ఇరు రాష్ట్రాల ఉప ముఖ్యమంత్రులు కూడా సమావేశం కాబోతున్నట్లు తెలుస్తోంది. అయితే ఇద్దరు సీఎంల భేటీలో ఏ అంశాలపై చర్చ సాగనుందనేది ఆసక్తికరంగా మారింది. సీఎంల భేటీకి ప్రగతి భవన్‌లో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. విభజనకు సంబంధించి అపరిష్కృతంగా ఉన్న అంశాలపై వీరిద్దరూ భేటీ కావటం ఇదే తొలిసారి. ప్రధానంగా షెడ్యూల్ 9, 10లో ఉన్న సంస్థల విభజనపై - మిగతా3లో

## తిరుమల శ్రీవారి ఆభరణాలపై విచారణ జరిపించాలి

బీజేపీ నేత భానుప్రకాశ్‌రెడ్డి.. భూమన కరుణాకర్‌రెడ్డిపై తనకు నమ్మకం లేదన్న భానుప్రకాశ్‌రెడ్డి

శ్రీవారి ఆభరణాలపై భక్తుల్లో అనుమానాలున్నాయన్న బీజేపీ నేత



## జగన్ పాలనలో సాగు నీటి ప్రాజెక్ట్‌లు నిర్వీర్యం

**అమరావతి**

జగన్ పాలనలో నీటి ప్రాజెక్ట్‌లు అన్ని ఇబ్బందుల్లో ఉన్నాయ ని జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఐదేళ్ల జగన్ పాలనలో 20 ఏళ్లు జలవనరుల శాఖ వెనక్కు వెళ్లిందని చెప్పారు. ఈ రోజు(శుక్రవారం) సీఈఎస్‌ఈ లతో మంత్రి నిమ్మల సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. వర్షాకాలానికి ముందే తీసు కోవాల్సిన జాగ్రత్తలు జగన్ ప్రభుత్వం తీసుకోలేదని అన్నారు. డ్యామ్ ఆపరేషన్స్ సరిగా లేకపోవడం ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లోలపై అంచనా వేయలేదని చెప్పారు ప్రాజెక్ట్‌ల ఎమర్జెన్సీ అంశాలను పరిశీలించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రాజెక్ట్ షటర్లు, గేట్లకు గతంలో గ్రీస్ కూడా వేయలేదని మండిపడ్డారు. ఈ ఐదేళ్లలో ఎక్కడ సిల్ట్ తీయలేదని.. - మిగతా3లో




# జగన్ పాలనతో అమరావతి ఆకర్షణ తగ్గింది

-మొదటిపేజీ తరువాయి

ఆకర్షణ కొంతవరకు తగ్గిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. అమరావతికి కోల్పోయిన ఆకర్షణను తిరిగి తీసుకురావడమే ప్రధాన ధ్యేయంగా పని కొనసాగుతోందని, 135 ప్రభుత్వ కార్యాలయాలు అమరావతిలో ఏర్పాటు కాబోతున్నాయని చంద్రబాబు వెల్లడించారు. అమరావతికి అవసరమైన ప్రాథమిక మౌలిక వసతులన్నీ కల్పిస్తామని, త్వరలోనే ఐకానిక్ బిల్డింగ్స్ సహా అన్ని కార్యాలయాల నిర్మాణాలను పూర్తి చేయబోతున్నామని తెలిపారు. వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నటువంటి భవనాలను తొలుత పూర్తి చేస్తామని, దశలవారీగా అమరావతిలో అన్ని నిర్మాణాలను త్వరితగతిన చేపడతామని సీఎం చంద్రబాబు క్లారిటీ ఇచ్చారు.

### కులగణన స్థానంలో నైపుణ్య గణన

రాష్ట్రంలో కులగణన స్థానంలో నైపుణ్య గణన చేపట్టాలని నిర్ణయించామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. దీనిపై క్యాబినెట్లో చర్చించి ఆమోదించామని, త్వరలో అన్ని మార్గదర్శకాలను విడుదల చేయబోతున్నామని ఆయన చెప్పారు. మానవ వనరులను మూలధన పెట్టుబడిగా మార్చి సంపద సృష్టించడమే లక్ష్యమన్నారు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలతో నైపుణ్యానికి అనుగుణంగా ఉపాధి కల్పిస్తామని వివరించారు. ప్రతి కుటుంబంలో నైపుణ్యాలను క్రోడీకరించి వాళ్ల శక్తి సామర్థ్యాలను పెట్టుబడిగా సంపద సృష్టిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. దీనివల్ల ఎక్కడికో వెళ్లి ఒకరి కింద పని చేయడానికి అవసరం ఉండదని, ప్రతి కుటుంబం ఒక ఔత్సాహిక పారిశ్రామికులుగా రూపొందుతారని దీమా వ్యక్తం చేశారు. తద్వారా ప్రతి కుటుంబ తలసరి ఆదాయం పెరుగుతుందని, పీపీపీ మోడల్ స్థానంలో పీ4 విధానం



తీసుకురావాలి అనుకుంటున్నామని చంద్రబాబు వివరించారు. సంపదలో అత్యున్నత స్థానంలో ఉన్న వాళ్లు అట్టడుగున ఉన్న 20 శాతం మందికి చేయూత ఇచ్చేలా చేయడమే పీ4 లక్ష్యమని చంద్రబాబు వివరించారు.

### రేవంత్ రెడ్డితో భేటీపై స్పందిస్తూ..

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో భేటీ నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఇరు రాష్ట్రాల ప్రయోజనాలు కాపాడాలన్నదే తన విధానమని, ఇరు రాష్ట్రాలకు సమ న్యాయం చేయాలని, విభజన సమయంలో కూడా తాను అదే చెప్పానని అన్నారు. ఇప్పుడు కూడా రేవంత్ రెడ్డితో సమావేశంలో ఇరు రాష్ట్రాల ప్రయోజనాలు దెబ్బతినకుండా సమస్యలు పరిష్కారం కావాలనే చర్చిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. మళ్లీ జగన్ వస్తే ఎలా అని అన్ని వర్గాలు అడుగుతున్నాయని, అయితే డెవిల్‌ని (దెయ్యం) నియంత్రించామని, ఇకపై ఎవరికీ ఎలాంటి ఇబ్బంది ఉండదని చంద్రబాబు వ్యాఖ్యానించారు. గత ఐదేళ్లగా జరిగిన నష్టం నుంచి బయటికి రావాలని, అందుకు అనుగుణంగా రాష్ట్రాన్ని నిలబెట్టేందుకు సహకారం ఇవ్వాలని కేంద్రాన్ని కోరామని ఆయన వివరించారు. దావోస్‌లో జరిగే పెట్టుబడుల సదస్సుకు తప్పకుండా హాజరవుతానని ఆయన ప్రకటించారు. దేశంలో ఏదైనా కొత్త విధానం తీసుకురావడానికి కమిటీకి నేతృత్వం వహిస్తారా అంటే... అది అంతా అప్పటి అవసరానికి అనుగుణంగానే ఉంటుందని చంద్రబాబు క్లారిటీ ఇచ్చారు. ఎన్డీఏ నాయకత్వం నుంచి ప్రతిపాదన ఉంటే అప్పుడు ఆలోచిస్తానని ఆయన చెప్పారు.

### దక్షిణాదిలో ఏ రాష్ట్రానికి లేనన్ని గొప్ప వనరులు: సీఎం

దక్షిణాదిలో ఏ రాష్ట్రానికి లేనన్ని గొప్ప వనరులు ఆంధ్రప్రదేశ్‌కి ఉన్నాయని చంద్రబాబు చెప్పారు. కృష్ణా, గోదావరి నదుల మధ్య ఆంధ్రప్రదేశ్ అంతా అనుసంధానమై ఉందని, ఒక్క గోదావరి నది నుంచి సుమారు 3000 టీఎంసీల నీరు సముద్రం పాలవుతోందని ఆయన ప్రస్తావించారు. ఆ నీటిని వినియోగించుకోగలిగితే రాష్ట్రంలో అద్భుతాలు సృష్టించవచ్చునని విశ్వాసం వ్యక్తం చేశారు. నదుల అనుసంధానం పూర్తిస్థాయిలో చేయగలిగితే గోదావరి నుంచే దక్షిణాది రాష్ట్రాలన్నింటికీ నీటి సరఫరా చేయవచ్చునని అన్నారు. రానున్న ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణమే లక్ష్యంగా పని చేస్తామని, గత ఐదేళ్ల దుష్పరిణామాల వల్ల రాష్ట్రానికి పూడ్చలేని స్థాయిలో నష్టం వాటిల్లిందని ఆయన వివరించారు. ప్రజలు ఎన్డీఏ కూటమికి అధికారం ఇచ్చారని, అందరం కలిసి రాష్ట్రాన్ని బాగు చేస్తామని చంద్రబాబు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలను గ్లోబల్ లీడర్లుగా తయారు చేయడం కర్తవ్యంగా పెట్టుకున్నామని సీఎం వెల్లడించారు.

# జగన్ పాలనలో సాగు నీటి ప్రాజెక్ట్‌లు నిర్వీర్యం

-మొదటిపేజీ తరువాయి

ఫలితంగా వేల ఎకరాల ఆయకట్టు మునిగి పోతుందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.
'ఖరీఫ్ పంటకు ఎలాంటి అవాంతరాలు లేకుండా యాక్షన్ ప్లాన్ చేసి, అగ్రికల్చర్ శాఖతో సమన్వయం చేసుకుంటాం. జగన్ పాపాలు ఇంకా వెంటాడుతున్నాయి.. పట్టి సీమలో మెయింటెయిన్ చేయకపోవడంతో బోల్ట్‌లు వూడి పోయే పరిస్థితి ఉంది. కృష్ణా డెల్టా శాసన సభ్యులు మాకు తాగు నీరు విషయంలో విజ్ఞప్తి చేశారు. కృష్ణా డెల్టాకు నీరు రావాలంటే ఆగస్టు ఫస్ట్ వీక్ లేదా సెకండ్ వారంలో అనుమతి వస్తుంది. పులిచింతలలో 30 నుంచి 40 టీఎంసీలు నిల్వ చేసేవారం. పులిచింతలలో 1/2 టీఎంసీ కూడా నీరు లేకుండా చేశారు. ఈ ప్రాజెక్టుల నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల నష్టం ఎక్కువగా ఉందిజ విభజన కన్న జగన్ పాలన వల్ల మనకు ఎక్కువ నష్టం వాటిల్లింది. ప్రాజెక్టులు ప్రాధాన్యత పరంగా త్వరగా పూర్తి చేయగల వాటిపై రివ్యూ చేశాం. జగన్ పాలనలో వ్యవస్థ నిర్వీర్యమై సాగునీటి ప్రాజెక్ట్‌లు ఇబ్బందుల్లో



ఉన్నాయి. ఎన్డీ ఏ ప్రభుత్వం రావడంలో ఉద్యోగస్తుల భాగస్వామ్యం ఉంది" అని తెలిపారు.

### పోలవరాన్ని జగన్ విధ్వంసం చేశారు..

"పట్టిసీమలో 24 పంప్‌లు గ్యాప్ ఇచ్చి వదులుకోవాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలో కాలువల వద్ద గ్రావల్ వద్ద తవ్వుకు పోయారు. మొత్తం నిన్న 15 పంపులు ఓపెన్ చేస్తే 2 పైప్ లైన్లు లీకేజీ వచ్చింది. పైప్ లైన్లపై అవగాహన ఉన్న మెగా అధికారులను కూడా పంపాను. రేపటికి 21 పంపులు ఓపెన్ చేసి కృష్ణా డెల్టా పరిధిలో దాహార్తి తీరుస్తా. రూ. 1300 కోట్లు పట్టిసీమకు ఖర్చుపెడితే రూ.50 వేల కోట్లు ఆదాయాన్ని ఇచ్చే పంటను కాపాడగలుగుతాం. పోలవరం విషయంలో జగన్ విధ్వంసం ఎలా జరిగింది సీఎం వివరించారు. చింతలపూడి వల్ల నాగార్జున సాగర్ ఆయకట్టు స్థిరీకరించే అవకాశం ఉంది. గతంలో కోర్ట్ చింతలపూడి విషయంలో 3 నెలలు సమయం ఇచ్చినా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. వ్యవసాయాన్ని లాభాసాటిగా చేయడం ప్రభుత్వ లక్ష్యం. జగన్ విధ్వంసం తో సీడబ్ల్యూసీ అంతర్జాతీయ నిపుణులను తెప్పించింది. పోలవరాన్ని సీఎం, అధికారుల పరిశీలించారు. నెలలో దీనికి సంబంధించి రిపోర్ట్ కూడా వస్తుంది. ప్రాజెక్టు సేఫ్టీకే ప్రాధాన్యం ఇవ్వాలి.. కొత్త దయా ఫ్రమ్ వాల్ అవసరం అయితే చర్యలు తీసుకుంటాం. దయా ఫ్రమ్ వాల్ దెబ్బతిన్న జగన్ పట్టించుకోలేదు. ఈ విషయంలో వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రాజెక్ట్‌లు నిర్వీర్యమయ్యే పరిస్థితి వచ్చింది" అని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

## టార్గెట్... వైసీపీ సీనియర్ నేతలు

# అంతా చట్టబద్ధమే

**విజయవాడ :** తెలుగుదేశం పార్టీ గెలిచిన మరుక్షణం వైఎస్‌ఆర్‌సీపీ నేతలకు కౌంట్ డౌన్ స్టార్ట్ అవుతుందని ఎన్నికలకు ముందు టీడీపీ నేతలు గర్జించేవారు. నారా లోకేష్ అయితే రెడ్ బుక్ చూపించి ఎవర్నీ వదిలే ప్రసక్తే లేదని చెప్పేవారు. ఇలా చెప్పినందుకు ఆయనపై సీఐడీ కేసు కూడా నమోదు చేసింది. ఆయనను అరెస్టు చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోర్టును కూడా కోరింది. ఇక ఇతర నేతలు, ద్వితీయ శ్రేణి నేతల ఆవేశం గురించి చెప్పాల్సిన పని లేదు. కూటమికి మెజార్టీ వచ్చిన మరుక్షణం విరుచుకుపడతారని అనుకున్నారు. కానీ ఎన్నికల ఫలితాలు వచ్చి నెల రోజులు గడుస్తున్నా పెద్దగా ఏమీ జరగలేదు. గ్రామ స్థాయిలో జరిగే చిన్న చిన్న గొడవలే బయటపడుతున్నాయి. నిజంగా టీడీపీ టార్గెట్ చేసుకున్న ఏ ఒక్క నేత కూడా ఇబ్బంది పడలేదు. కొడాలి నాని దగ్గర్నుంచి రోజా వరకూ అందరూ నింపాదిగానే రాజకీయాలు చేసుకుంటున్నారు. అందుకే టీడీపీ కార్యకర్తల్లో రెడ్ బుక్ ఏమియందన్న ప్రశ్న వస్తోంది. కానీ అంతర్గతంగా మాత్రం వైసీపీ ముఖ్య నేతలందర్నీ చట్టబద్ధంగా ఫిక్స్ చేసేందుకు క్రమబద్ధంగా ప్రక్రియ పూర్తి చేస్తున్నారన్న సమాచారం మాత్రం మెల్లగా బయటకు వస్తోంది. ఏపీలో ఎన్నికల కౌంటింగ్ జరిగిన తర్వాత రోజు నుంచే కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయక ముందే ఏపీ బేవరెజెస్ కార్పొరేషన్ మొత్తాన్ని గుప్పిట్లో పెట్టుకున్న అధికారి వాసుదేవరెడ్డి ఇంట్లో సోదాలు ప్రారంభించారు. ఆయన తనను అరెస్టు చేస్తారేమోనన్న భయంతో హైకోర్టు ను ఆశ్రయించారు. కానీ ఊరట దక్కలేదు. కానీ సీఐడీ అధికారులు వాసుదేవరెడ్డిని అరెస్టు చేయలేదు. కానీ సోదాలు మాత్రం కొనసాగిస్తున్నారు. ఆయనపై రికార్డుల తస్కరణ కేసు పెట్టారు. ఈ విషయంలో వాసుదేవరెడ్డి ఏపీ ప్రభుత్వం టార్గెట్ కాదు. ఆయన ఇచ్చింది తీసుకుని పై వాళ్లు చెప్పినట్లుగా చేశారు. ఆ పైవాళ్లనే సీఐడీ టార్గెట్ చేసింది. అందుకే మొత్తం గుట్టు రట్టు చేస్తున్నారు. విషయం బయటకు రాకుండా అసలు ఏం జరిగిందో లెక్కలతో సహా వెలుగులోకి తెస్తున్నారు. ఇప్పటికే మద్యం విషయంలో జరిగిన భారీ స్కాం విషయంలో అన్ని ఆధారాలను సేకరించారని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. జగన్ అధికారంలోకి రావడంతోనే పాలసీ మార్చేశారు. ప్రభుత్వ దుకాణాలు పెట్టారు. అందులో వైసీపీ నేతల డిస్టిలరీల్లో తయారయ్యే విచిత్రమైన బ్రాండ్లే అమ్మారు. అదీ కూడా నగదుకే అమ్మారు. ఈ వ్యవహారంలో అసలు గూడుపుఠాణి మొత్తంబయటకు వచ్చేసిందని అంటున్నారు. అలాగే ఇసుక వ్యవహారంలో కూడా సంచలనాత్మక స్కాం ఉందని అంటున్నారు. ఇసుక పేరుతో ప్రభుత్వానికి పెద్దగా ఆదాయం రాకుండానే .. ప్రైవేటు కంపెనీలు ఇసుకను దోపిడీ చేసేలా అనుమతి ఇచ్చారు. వారు కూడా పూర్తిగా నగదు లావాదేవీలే నిర్వహించారు. ఈ మూలాలన్ని నేరుగా జగన్మోహన్ రెడ్డి దగ్గరే ఉన్నాయని టీడీపీ నేతలు చెబుతున్నారు. హడావుడి చేయకుండా ఆధారాల సేకరణ పూర్తి చేయగానే కేసులు నమోదవడం ఖాయమని చెబుతున్నారు. గనుల మంత్రిగా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నిర్వాకాలపై టీడీపీ పూర్తి సమాచారం సేకరించింది. గనుల సీవరేజీ దగ్గర నుంచి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా తవ్వేసుకోవడం వరకూ చాలా అక్రమాలు వెలుగులోకి వచ్చాయని చెబుతున్నారు. గనుల శాఖలో అంతా ప్రైవేటు ఉద్యోగులే ఐదేళ్లు చక్రం తిప్పారని అంటున్నారు. టీడీపీ నేతల గనుల్ని లాక్కుని వైసీపీ నేతలకు అప్పగించడం కోసం.. తప్పుడు నివేదికలు ఇచ్చి వందల కోట్ల జరిమానాలు విధించిన రికార్డు ఉంది. అలాగే నేపాల్‌లో పట్టుబడిన ఎర్రచందనం పెద్దిరెడ్డికి చెందినదని తేలిందని పర్యావరణ మంత్రి పవన్ కళ్యాణ్ నేరుగా వెల్లడించారు. ఇది సంచలనం అయింది. ఎర్రచందనం స్మగ్లింగ్ విషయంలో పెద్దిరెడ్డి పేరు నేరుగా డిప్యూటీ సీఎం పవన్ చెప్పినా.. ఆయన వైపు నుంచి ఎలాంటి స్పందన రాలేదంటనే వారు నిజంగా ఇరుక్కుపోయారన్న క్లారిటీ వచ్చిందని టీడీపీ నేతలంటున్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తాను మంత్రి పదవిలో ఉండి టీడీపీని తీవ్ర స్థాయిలో టార్గెట్ చేశారు. కుప్పం మున్సిపాలిటీలో టీడీపీని అనుచిత పద్ధతుల్లో ఓడించారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే అసెంబ్లీ ఎన్నికల్లో కుప్పం, హిందూపురంలో వందల కోట్లు ఖర్చు చేసి టీడీపీని ఓడించడానికి ప్రయత్నించారని అంటున్నారు. అలాగే టీడీపీ నేతలపై కేసులు పెట్టడం.. వేధించడం.. చంద్రబాబుపై రాళ్ల దాడిలోనూ ఆయన కుట్ర ఉందని అనుమానిస్తున్నారు. అందుకే పక్కాగా చట్ట బద్ధంగా కేసుల వల రెడీ అయిందని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి.సీనియర్ మంత్రిగా జగన్ ప్రభుత్వం లో చక్రం తిప్పిన బొత్స సత్యనారాయణ .. బదిలీలకు లంచం తీసుకున్నారన్న దగ్గర నుంచి విద్యాకానుక కిట్ల వరకూ అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. రోజా తిరుమల దర్శన టిక్కెట్ల దందా దగ్గర నుంచి రుషికొండ ప్యాలెస్ వరకూ అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. తాజాగా పులివెందులలో అసలు ఏ మాత్రం విలువ చేయని వైసీపీ నేత భవనాన్ని పన్నెండున్నర కోట్లు పెట్టి కొన్నారన్న ఆరోపణ దుమారం రేపుతోంది. ఇక ఆడుదాం ఆంధ్రా పేరుతో వంద కోట్ల స్కాం చేశారని ఇప్పటికే ఫిర్యాదులు విచారణాధికారుల వద్దకు వెళ్లాయి. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ నేతలు, కార్యాలయాలపై జరిగిన దాడులకు లెక్కే లేదు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై 2021లో దాడి జరిగితే కేసులు పెట్టలేదు. ఇప్పుడు పోలీసులు రంగంలోకి ?గారు. అప్పటి సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించే పనిలో ఉన్నారు. ఈ కేసులో ఐదుగుర్ని అరెస్ట్ చేశారు. నిందితులను పట్టుకోవడంతోపాటు దాడికి పురిగొల్పిన నేతలపైనా చర్యలకు సిద్ధమవుతోంది ప్రభుత్వం. నిందితుల్లో ఎక్కువ మంది మంగళగిరి మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, వైసీపీ ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి, విజయవాడ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాశ్ అనుచరులు ఉన్నారు. ఈ దాడి వెనకు సూత్రధారులు వాళ్లేనని .. నిందితుల ద్వారా చెప్పించే అవకాశాలు ఉన్నాయి. నిందితులను పట్టుకోవడంతోపాటు ఈ ముగ్గురిపైనా ఏమైనా చర్యలు తీసుకుంటారా? అన్న టెన్షన్ వైసీపీలో కనిపిస్తోంది. ఇక కాకినాడలో ఎమ్మెల్సీ అనంతబాబు కారు డ్రైవర్ హత్య కేసును ప్రభుత్వం పునర్విచారించాలని భావిస్తోంది. ఈ కేసులో అనంతబాబుతోపాటు మరికొందరి ప్రమేయం ఉందనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు ప్రభుత్వ పెద్దలు. అదేవిధంగా విశాఖలో డాక్టర్ సుధాకర్ కేసును మళ్లీ ఓపెన్ చేస్తున్నారు. సుధాకర్ ఎపిసోడ్‌లో భూ సంబంధ వ్యవహారాలు ఉన్నాయనే సమాచారం ప్రభుత్వానికి చేరడంతో అంతర్గత విచారణ ముమ్మరంగా సాగుతోంది. గత ప్రభుత్వంలో నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారు. ఇదే సమయంలో ప్రజాధనం తిరిగి వసూలు చేసేలా ప్రత్యేక చట్టం చేయాలని ఆ లేఖలో సూచించారు. గనుల లీజులు, ఇసుక తవ్వకాలు, మైనింగ్ వ్యవహారాల్లోనూ ఎవరెవరి పాత్ర ఉందని తెలుసుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక బృందాన్ని నియమించింది. రాయలసీమకు చెందిన ముఖ్య నేతలు గనుల లీజుల్లో అవినీతికి పాల్పడ్డారని ప్రభుత్వం వద్ద పక్కా సమాచారం ఉన్నట్లు చెబుతున్నారు.

## విభజన అంశాలు ఇప్పటికైనా కొలిక్కి వచ్చేనా?

-మొదటిపేజీ తరువాయి

చర్చించే అవకాశాలు ఉన్నాయి. విద్యుత్తు సంస్థలకు సంబంధించి రెండు రాష్ట్రాల మధ్య బకాయిలపై చర్చించే అవకాశముంది. దాదాపు రూ.24 వేల కోట్లు ఏపీ ప్రభుత్వం తెలంగాణకు చెల్లించాల్సి ఉంది. కానీ.. రూ.7 వేల కోట్లు తెలంగాణ తమకు చెల్లించాల్సి ఉందని ఏపీ ప్రభుత్వం పట్టుబడుతోంది. విభజనకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. మార్చి నెలలో సీఎం చొరవతో ఢిల్లీలో ఏపీ భవన్‌కు సంబంధించిన విభజన వివాదం పరిష్కారమైన విషయం తెలిసిందే. ఇటీవలే మైనింగ్ కార్పొరేషన్‌కు సంబంధించిన నిధుల పంపిణీకి పడిన చిక్కుముడి కూడా వీడిపోయింది. ఇప్పటి వరకు విభజన వివాదాలపై రెండు రాష్ట్రాల అధికారుల మధ్య దాదాపు 30 సమావేశాలు జరిగాయి. షెడ్యూల్ 9లో ఉన్న మొత్తం 91 సంస్థలు ఆస్తులు, అప్పులు, నగదు నిల్వల పంపిణీపై కేంద్ర హోం శాఖ షీలాబీడే కమిటీని వేసింది. వీటిలో 68 సంస్థలకు సంబంధించిన పంపిణీకి అభ్యంతరాలేమీ లేవని స్పష్టం చేసింది. మిగతా 23 సంస్థల పంపిణీపై రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదని సమాచారం. పదో షెడ్యూలులో ఉన్న 142 సంస్థల్లో తెలుగు అకాడమీ, తెలుగు యూనివర్సిటీ, అంబేద్కర్ యూనివర్సిటీ వంటి 30 సంస్థల పంపిణీపై ఇంకా వివాదాలున్నాయి.వీటితో పాటు పలు అంశాల మీద సీఎంలు చర్చించే అవకాశాలు ఉన్నాయి. కాగా ఈ భేటీలో రెండు రాష్ట్రాల సీఎంలతో పాటు.. ఇంకా ఎవరెవరు పాల్గొంటారు.. అజెండా ఏంటి అనేదానిపై మాత్రం మరింత క్లారిటీ రావాల్సి ఉంది.

## కొత్తగా వచ్చే పారిశ్రామికవేత్తలతో ఫ్రెండ్లీగా ఉండండి



-మొదటిపేజీ తరువాయి

ఆదేశించారు. రాష్ట్రంలో కొత్తగా ఐటీ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలను ఆకర్షించడానికి మెరుగైన విధానాలతో నూతన ఐటీ పాలసీని తీసుకురానున్నామని, ఇందుకోసం పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా ఉండేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగంలో పెట్టుబడుల పర్యవేక్షణకు గతంలో (2019కి ముందు) ఉన్న పోర్టల్ ను మరింత మెరుగ్గా తీర్చిదిద్ది అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. విశాఖపట్నంలో ఐటీ పరిశ్రమల ఏర్పాటుకు అందుబాటులో ఉన్న ప్లగ్ అండ్ ప్లే ఇన్ ఫ్రాస్ట్రక్చర్ పై నివేదిక ఇవ్వాలని అధికారులను కోరారు. అదేవిధంగా విశాఖ, పరిసరాల్లో కొత్తగా పరిశ్రమలు ఏర్పాటుచేసేందుకు ఆసక్తి చూపే పారిశ్రామికవేత్తలకు ఏమేరకు భూమి అందుబాటులో ఉందో పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగ పరిశ్రమదారులతో సమావేశమై వారి సమస్యలు, అవసరాలను తెలుసుకొని పరిష్కరించాలని, పారిశ్రామికవేత్తలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల కార్యదర్శి కోన శశిధర్, జాయింట్ డైరెక్టర్ (ప్రమోషన్స్) సూర్జిత్ సింగ్, ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్ సొసైటీ సీఈవో అనిల్ కుమార్, ఎపిటా జనరల్ మేనేజర్ విజయకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల శ్రీవారి ఆభరణాలపై విచారణ జరిపించాలి

తిరుమల శ్రీవారి భద్రతపై భక్తుల్లో అనుమానాలున్నాయని, కాబట్టి హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీజేపీ ఏపీ అధికార ప్రతినిధి భానుప్రకాశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ ఉదయం శ్రీవారిని దర్శించుకున్న ఆయన అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రపంచ హిందూ ధార్మిక క్షేత్రమైన తిరుమలను వైసీపీ అధర్మ క్షేత్రంగా మార్చిందని ధ్వజమెత్తారు. దర్శన టికెట్ల నుంచి ఇంజినీరింగ్ పనుల వరకు అన్నింటిలోనూ వైసీపీ నేతలు అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. వందల కోట్ల రూపాయలను కమీషన్ల రూపంలో దండుకున్నారని చెప్పారు. గతంలో టీటీడీ చైర్మన్‌గా పనిచేసిన భూమన కరుణాకర్‌రెడ్డిపై తనకు నమ్మకం లేదని, కాబట్టి సిట్టింగ్ జడ్జితో కమిటీ వేసి విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## ఏపీలో హెల్త్ టూరిజంని అభివృద్ధి చేస్తాం

-మొదటిపేజీ తరువాయి

ఆదాయాన్ని కూడా పెంచుతామని కందుల దుర్గేష్ తెలిపారు. రాష్ట్రంలో ఎకో, టెంపుల్, హెరిటేజ్,హెల్త్ టూరిజంని అభివృద్ధి చేస్తామన్నారు. చిన్నపాటి అభివృద్ధి చెయ్యడం ద్వారా పర్యాటక రంగం ఆదాయాన్ని పెంచవచ్చన్నారు. కేంద్రం కూడా పర్యాటక రంగ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కేంద్రం ద్వారా కూడా రాష్ట్రానికి నిధులు తెచ్చి రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. టూరిజం శాఖ ద్వారా దర్శించుకునే భక్తులకు స్వామి వారి దర్శనానికి అధిక సమయం పడుతోందన్నారు. ఈ సమస్యను ఈవో దృష్టికీ తీసుకెళ్లి టూరిజం ద్వారా వచ్చే భక్తులకు త్వరగతిన దర్శనం అయ్యేలా ఏర్పాట్లు చెయ్యాలని విజ్ఞప్తి చేస్తానన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా టూరిజం శాఖలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించి త్వరగతిన పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.

## జగన్‌కు నితీష్ అస్త్రం

**ఒంగోలు :** వైఎస్ జగన్ కి అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర ఓటమి తర్వాత పరిస్థితులు తలకిందులయ్యాయి. 151 సీట్ల నుంచి ఒక్కసారిగా 11 సీట్లకు పడిపోవడంతోపాటు వైసీపీ అధినేత జగన్ తీవ్ర నిరాశలో మునిగిపోయారు. అసెంబ్లీలో కేవలం 11 సీట్లే రావడంతో ప్రతిపక్ష హోదా కల్పించమని అర్థించవలసి వచ్చింది. అది కూడా తనను ద్వేషిస్తున్నాడు, తన చావునే కోరుకున్నాడని చెప్పుకునే అయ్యన్నపాత్రుడుకి లేఖ రాయడం జగన్‌కు ఇబ్బందికరంగా మారింది. అయినా ప్రతిపక్ష హోదా వస్తుందన్న నమ్మకం లేదు. మొన్నటిదాకా సిద్ధం సభల్లో నేను అభిమన్యుణ్ని కాదు అర్జునుడిని అని జగన్ చెప్పుకున్నప్పటికీ ఎన్నికల్లో ఘన విజయం తర్వాత చంద్రబాబు తన వ్యూహాలతో జగన్‌ని పద్మవ్యూహంలోకి నెట్టేశారన్న సైటైర్లు వినిపిస్తున్నారు. ఆ విధంగా నువ్వు అర్జునుడివి కాదు.. అభిమన్యుడివే అని చంద్రబాబు చెప్పకనే చెప్పారు. టీడీపీకి 16 మంది ఎంపీలుంటే, నాక్కూడా రాజ్యసభ 11, లోక్‌సభలో 4 కలిపి 15 మంది ఎంపీలున్నారని జగన్ పైకి చెప్పుకుంటున్నప్పటికీ బీజేపీ నుంచి ఆశించిన మద్దతు మాత్రం లభించడం లేదు. ఎన్డీఏలో టీడీపీ భాగస్వామిగా ఉన్నా, జగన్ మాత్రం స్పీకర్ ఎన్నికల్లో బీజేపీకే తన మద్ధతు ప్రకటించారు. ఇన్ని చేసినా జగన్ కోరుకున్న జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత కేంద్రం కల్పించలేదు.బీహార్ సీఎం నితీశ్ కుమార్ రూపంలో ఆయనకు ఒకదారి దొరికింది. బీహార్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలని నితీశ్ డిమాండ్ చేయడంతో జగన్‌కి వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్టయింది. టీడీపీని ఎదుర్కోవడానికి సరైన సమయంలో సరైన అస్త్రం దొరికినట్టయింది వైసీపీకి. ఏపీకి సంబంధించి పోలవరం, ప్రత్యేక హోదా, విశాఖ స్టీల్ ప్లాంట్ వంటి అంశాల్లో ఎలాంటి ప్రకటన చేయకపోయినా బీజేపీతో జట్టు కట్టిన చంద్రబాబు, భారీ విజయం తర్వాత కన్వినియంట్‌గా డిమాండ్‌లు పక్కనపెట్టేసి అమరావతి మీద పూర్తిగా ఫోకస్ చేస్తాడని అందరూ అనుకున్నారు. కానీ నితీశ్ కుమార్ బీహార్ కు ప్రత్యేక హోదా డిమాండ్ చేయడంతో బాబు కూడా ఇరుకునపడినట్టయింది. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాన్ బెనర్జీ వాషింగ్ పౌడర్ నిర్మా స్కీమ్‌లో భాగంగా ఎన్డీఏలో చేర్చుకుని చంద్రబాబుపై కేసులని మాఫీ చేశారని బీజేపీపై చేసిన ఆరోపణలు సభలో ఉన్న టీడీపీ ఎంపీలను ఇరకాటంలో పడేశాయి. ఎన్డీఏలో భాగస్వామిగా ఉండి కూడా ప్రత్యేక హోదా అడగడం లేదని రాబోయే రోజుల్లో రాష్ట్రంలో చంద్రబాబును దోషిగా నిలబెట్టేందుకు జగన్ వ్యూహ రచన చేసే అవకాశం లేకపోలేదు. నితీశ్ చేసిన పని బాబుని ఇరకాటంలోకి నెట్టేసింది. ప్రస్తుతం ఉన్న ఆర్థిక సంక్షోభంతో పాటు తనపై ఉన్న కేసుల నేపథ్యంలో చంద్రబాబు సైతం గట్టిగా ప్రశ్నించలేదు.

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

# కనిగిరిలో తొలగించిన బంకులు ఎవరివి..?

## నోరున్నవారివే ఈ బంకులు
## 90శాతం చిరు వ్యాపారులు అద్దె చెల్లింపు





**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జులై 5)**
కనిగిరిలో రోడ్ల ఆక్రమణలకు అధికారులు చర్యలు చేపట్టారు. పామూరు రోడ్డు, ఓవీరోడ్డు, చెప్పుల బజార్‌లలో సుమారు 350 బంకులను మున్సిపల్ అధికారులు బుధవారం తొలగించారు. అయితే ఆ బంకులలో 90శాతం నోరున్నవారివే అనే చర్చ కనిగిరిలో సాగుతుంది. గత 40 ఏళ్ల నుంచి అధికార అండతో రోడ్డు మార్జిన్‌లో స్థలాలను కబ్జా చేసి బంకులు పెట్టి వాటిని అద్దెకిస్తున్నారు. అయితే ఒక్కో బంకుపై రూ.15 వేల నుంచి రూ.20వేల వరకు అద్దె లావాదేవీలు జరుగుతున్నాయంటే నోరున్న వారి వ్యాపారం ఏ విధంగా సాగుతుందో అర్థం అవుతుంది. మాజీ ఎంపీటీసీలు, ప్రస్తుత కౌన్సిలర్‌ల ముగ్గురికి సుమారు 12 బంకులు ఉన్నట్లు సమాచారం. ఒక్కో బంకు ద్వారా రూ.10వేలు అద్దె వస్తున్నట్లు తెలుస్తోంది. ఓ నాయకుడికి అయితే నెలకు రూ.60వేలు అద్దె వస్తున్నట్లు కనిగిరిలో ప్రచారం జరుగుతుంది. ఈ బంకుల్లో వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారులు 90శాతం మంది అద్దె చెల్లిస్తూ వ్యాపారం చేసుకుంటున్నారు. ఈ బంకుల ఆక్రమణలపై మున్సిపల్ అధికారులు దృష్టి పెట్టడంతో అద్దెల బాగోతం మరింత బహిర్గతమైంది. నిజంగా వ్యాపారం చేసుకునే వారికి పాలకులు ప్రత్యామ్నాయ మార్గం చూపిస్తే

4

# వై పాలెం ఎస్ఐ సుదర్శన్ సస్పెండ్

**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, జూన్ 55)**
యర్రగొండపాలెం ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న సుదర్శన్ అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడంతో శుక్రవారం సస్పెండ్ చేశారు. ఎన్నికలకు ముందు త్రిపురాంతకంతో విధులు నిర్వహిస్తున్న సుదర్శన్ ఎన్నికల బదిలీల్లో భాగంగా యర్రగొండపాలెం ఎస్సైగా వచ్చారు. కాగా ఎన్నికల సమయంలో ఖర్చులు ఎక్కువ అయ్యాయి. ప్రభుత్వం నుంచి నిధులు రాలేదు. నా సొంత జేబు నుంచి ఖర్చు చేశాను. అందుకే మీరందరూ నాకు సహకరించి ఒక్కో సంఘం తరుపున రూ. 20 వేలు అయినా ఇవ్వాలంటూ యర్రగొండపాలెం పట్టణంలోని వివిధ వర్తక వాణిజ్య సంఘాలకు హుకుం జారీ చేశారు. కొందరు భయపడ్డి ముట్టజెప్పగా మరికొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే స్టేషన్ కు వచ్చే వివిధ రకాల బాధితుల నుంచి సైతం భారీగానే డబ్బులు వసూలు చేసినట్లు విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ డాక్టర్ సుమిత్ గరుడ్ ఆదేశాల మేరకు మార్కాపురం డిఎస్పీ బాల సుందరరావు, యర్రగొండపాలెంలో విచారించి నివేదికను ఉన్నతాధికారులకు పంపారు. దీంతో ఉ న్నతాధికారులు ఎస్సై సుదర్శన్ ను సస్పెండ్ చేశారు.



# ఐజి సర్వశ్రేష్ఠ తిపాటి కి శుభాకాంక్షలు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 7)**
శుక్రవారం సాయంత్రం విజయవాడలో గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్ఠ త్రిపాటిని ఒంగోలు, గిద్దలూరు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, ముత్తుముల అశోక్‌రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. వీరి వెంట ప్రకాశం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు షేక్ రియాజ్, తదితరులు ఉన్నారు.



# ప్రజలు భయం నుంచి బయటకొచ్చారు

స్వేచ్ఛగా వ్యాపారస్తులు వ్యాపారాలు చేసుకోవచ్చు
బిల్డర్స్ రూల్స్ అతిక్రమించవద్దు
త్వరలోనే అందరితో కలిసి సమావేశమవుతా
ఖజానాలో ఒక్క పైసా లేదు
వచ్చే శనివారం ఇరిగేషన్ శాఖ మంత్రితో సోమశిల విజిట్ చేస్తాం
ఎమ్మెల్యేలతో సంప్రదించి అభివృద్ధి పనులు చేపడుతాం
రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ
ముగిసిన రాష్ట్ర మంత్రులు ఆనం, నారాయణల భేటీ



**(షణ్ముణ వెలుగు, నెల్లూరు, జులై 5)**
నెల్లూరు నగరం సంతపేటలోని మంత్రి ఆనం క్యాంప్ కార్యాలయంలో...రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ (తరువాయి 4లో...)

# మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామికి అభినందనలు



**(షణ్ముఖ వెలుగు, కొండపి, జులై 7)**
రాష్ట్ర సాంఘీసంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామిని కొండపిలోని ఆయన స్వగ్రహంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, తెలుగు మహిళా నాయకురాలు సోమిశెట్టి శ్రీదేవిలు శుక్రవారం (తరువాయి 4లో...)



# తాగునీటి సరఫరా పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

## జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 7)**
తాగునీటి సరఫరాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా చెప్పారు. శుక్రవారం ప్రకాశం భవనంలోని తన ఛాంబర్‌లో ఒంగోలు కార్పొరేషన్తో సహా అన్ని మున్సిపాలిటీలు, నగర పంచాయతీల కమిషనర్లతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా మున్సిపాలిటీలలో ఉన్న ఇళ్లు, సరఫరాకు ఉన్న డిమాండ్, ప్రస్తుతం సరఫరా చేస్తున్న పరిమాణం, అందుబాటులో ఉన్న నీటి వనరులు, తాగునీటి సరఫరాకు కొత్త పథకాలు-ప్రతిపాదనలు, ట్యాంకుల ద్వారా సరఫరా తదితర అంశాలపై ఆమె సమీక్షించారు.
(తరువాయి 4లో...)





# కనిగిరిలో తొలగించిన బంకులు ఎవరివి..?

సరిపోతుందని పట్టణ ప్రజలు అంటున్నారు. రోడ్డు మార్జిన్‌లోని బంకులను కొనుగోలు, అమ్మకాలు చేస్తూ వ్యాపారాలు జరుగుతున్నాయి. ఈ బంకులకు కూడా లక్షల్లో అడ్వాన్సు తీసుకుని అద్దెలు వసూలు చేస్తున్నారు. ఇప్పటి వరకు ఆక్రమణలు తొలగించిన రోడ్లను బాగు చేస్తున్నారు. రోడ్ల వెంట ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తస్తంభాలను రోడ్డు మార్జిన్‌లో వేసేలా మున్సిపల్ కమిషనర్ విద్యుత్ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. మిగిలిన రోడ్లలో ఆక్రమణలు కూడా తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. రోడ్ల వెడల్పులో భాగంగా ఆక్రమణల బంకులను తొలగించడం వలన అద్దెల వసూలు చేసుకునే వారే నష్టపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. నిజంగా బంకుల ద్వారా వ్యాపారం చేసుకునే వారికి కొంతమేర నష్టం జరుగుతుంది. ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, అధికారులు స్పందించి చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని ప్రజలు కోరుతున్నారు.

# తాగునీటి సరఫరా పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

ఒంగోలు కమిషనర్ జస్వంతరావు మాట్లాడుతూ రెండు నెలలకు సరిపడా నీరు ప్రస్తుతం అందుబాటులో ఉందన్నారు. రామతీర్థం నుంచి స్థానిక చెరువులకు నీటిని తరలిచి నిల్వ చేశామన్నారు. కొత్తగా కార్పొరేషన్లో విలీనమైన 37 గ్రామాలకు 35 ట్యాంకర్ల ద్వారా రోజుకు 250 ట్రిప్పుల వరకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ఇతర మున్సిపాలిటీలలో కూడా తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పాలన, ఆర్థికపరమైన అంశాలు ఏమైనా ఉంటే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఆమె చెప్పారు.

# ప్రజలు భయం నుంచి బయటకొచ్చారు

పొంగూరు నారాయణలు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు రాష్ట్ర, జిల్లా అభివృద్ధి పనులపై ఇరువురు సుదీర్ఘగంగా చర్చించారు. అనంతరం రాష్ట్ర మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మీడియాతో మాట్లాడారు... సోమశిల డ్యాం వద్ద పలు పలు సమస్యలు, ఓ ఆలయం కూడా డ్యామేజ్ అయిందని...ఈ విషయాలను మంత్రి ఆనం నాతో చర్చించారన్నారు. ఇరిగేషన్ శాఖ మంత్రిని ఆహ్వానించామని...ఆయన వచ్చే శనివారం విజిట్ కి వస్తామని చెప్పారన్నారు. ఆయన రాగానే ముగ్గరం కూర్చొని...అభివృద్ధి కార్యక్రమాలపై చర్చిస్తామని తెలిపారు. గత ఐదేళ్లుగా నెల్లూరులో ప్రజలతోపాటు చిరు వ్యాపారులు, పెద్ద పెద్ద వ్యాపారులు సైతం చేసుకునేందుకు భయపడుతుండేవారన్నారు. ఇప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలందరూ ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. వ్యాపారస్తులందరూ స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకోవచ్చని భరోసా కల్పించారు. అయితే నియమ నిబంధనలు తప్పని సరిగా పాటించాలని కోరారు. ప్రధానంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు... గత ప్రభుత్వంలో నెల్లూరు, కడప జిల్లాల్లోని లేఅవుట్‌లలో చాలా అక్రమాలు జరిగాయని, వెంటనే వాటిపైన ఎంక్వైరీ కమిటీ వేయాలని చెప్పారని...ఆ విధంగానే విచారణ కమిటీని వేశామన్నారు. ఈస్ట్ గోదావరిలో టీడీఎస్ బాండ్లలో చాలా అక్రమాలు జరిగాయని... వాటన్నింటిపైన కూడా సీఎం చంద్రబాబు విచారణ చేపట్టాలని ఆదేశించారని...వాటికి కూడా ఎంక్వైరీ కమిటీలను వేయడం జరిగిందని...ఆ నివేదికలు వచ్చిన తరువాత వాటిపైన యాక్షన్ తీసుకోవడం జరుగుతుందన్నారు. త్వరలోనే బిల్డర్స్ అందరితో కలిసి సమావేశమై పలు విషయాలను చర్చిస్తామని చెప్పారు. బిల్డర్స్ మాత్రం ఎట్టి పరిస్థితిలో రూల్స్ అతిక్రమించవద్దని సూచించారు. ప్రజలందరూ ఒక భయంలో ఉండేవారని, తెలుగుదేశం ప్రభుత్వం రాగానే భయాన్ని వీడి ప్రశాంతంగా ఉన్నారన్నారు. రాష్ట్ర ఖజానాలో ఒక్క పైసా లేదని, మున్సిపల్ శాఖలోనే రూ.3,500 కోట్లు కలెక్షన్ ఉంటే మొత్తం సీఎఫ్ఎంఎస్‌కు తరలించారని, అక్కడ కూడా పైసా లేదన్నారు. ఇలాంటి సమస్యలను త్వరలోనే అధిగమించి రాష్ట్ర, జిల్లా అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అందరి ఎమ్మెల్యేలతో సంప్రదించి మున్సిపాలిటీలు, నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులను చేపడుతామని మంత్రి నారాయణ తెలిపారు.

# మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామికి అభినందనలు

మంత్రి స్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి స్వామిని గజమాలతో ఘనంగా టీడీపీ నేతలు సత్కరించారు. అనంతరం మంత్రి స్వామి చేత కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సామి రాజ, సోమిశెట్టి చిరంజీవి, పమిడిమర్రి తిరుపాలు, సామి సూరి, నేరెళ్ళ ఏడుకొండలు, నేరెళ్ళ శ్రీనివాసులు, ఉప్పు నాగేశ్వరరావు, కిషోర్, మేడా అనంత శ్రీనివనాసరావు, తదితరులు పాల్గొన్నారు.



# మంత్రి నారాయణతో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి భేటీ

## నారాయణని శాలువాతో సత్కరించిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

## రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో త్వరలో జరగనున్న బారాషహీద్ రొట్టెల పండుగపై ఇరువురు సుదీర్ఘంగా చర్చ



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 5)
నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణతో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మంత్రి నారాయణను శాలువాతో సత్కరించారు. రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో త్వరలో జరగనున్న బారాషహీద్ రొట్టెల పండుగపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, చిట్టమూరు ప్రవీణ్ కుమార్‌రెడ్డితో పాటు టిడిపి ముఖ్య నేతలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన రోడ్లలో నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

## కనిగిరి మునిసిపల్ కమీషనర్ టీవీ రంగారావు

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జులై 5)
కనిగిరి పురపాలక సంఘం పరిధిలోని ప్రధాన రోడ్లలో పాత స్తంభాలను తొలగించి నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయనున్నట్లు మునిసిపల్ కమీషనర్ టీవీ రంగారావు తెలిపారు. శుక్రవారం కనిగిరి పురపాలక సంఘం కార్యాలయంలో విద్యుత్ కార్యాలయ సిబ్బంది, వార్డు ఎమినిటి సెక్రటరీలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని ఒంగోలు రోడ్డు, పామూరు రోడ్డు, కందుకూరు రోడ్డు, చెప్పుల బజారు తదితర ప్రాంతాలలో నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తామన్నారు. పట్టణంలోని ప్రధాన రోడ్లలో డివైడర్ ఏర్పటు చేసి సిటి బ్యూటిఫికేషన్ చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో విద్యుత్ డీఈఆర్ ఉమాకాంత్, ఏఈ పవన్ కుమార్, లైన్ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, సచివాలయ ఎమినిటి సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.



# పాత్రికేయులకు రైల్వే పాసులు పునరుద్ధరించండి

## రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరీకి సీనియర్ జర్నలిస్టు నిమ్మరాజు చలపతిరావు

## చిన్న పత్రికలకు కేంద్ర ప్రభుత్వ ప్రకటనలు ఇవ్వాలి

## ఎంపీ పురంధరేశ్వరీకి నిమ్మరాజు వినతి

(షణ్ముణ వెలుగు, విజయవాడ, జులై 5)
కరోనా కష్టకాలంలో రద్దయిన పాత్రికేయుల రైల్వే పాసుల పునరుద్ధరణకు కేంద్రంలో మీవంతుగా కృషి చేయాలని సీనియర్ పాత్రికేయుడు ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఉమ్మడి రాష్ట్ర మాజీ కార్యదర్శి నిమ్మరాజు చలపతిరావు విజ్ఞప్తి చేశారు. రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలిగా లోక్‌సభలో ప్రమాణ స్వీకారం అనంతరం ఢిల్లీ నుంచి విజయవాడ వచ్చిన మాజీ కేంద్ర మంత్రి దగ్గుబాటి పురంధరేశ్వరీ శు క్రవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. సరైన ఆదాయ వనరులు లేక రాష్ట్రంలో చిన్న, మధ్య తరహా పత్రికలనేకం కొట్టుమిట్టాడుతున్నాయని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. చిన్న, మధ్య తరహా పత్రికల మనుగడ కోసం ముఖ్యమైన సందర్భాల్లో కేంద్ర ప్రభుత్వ ప్రకటనలు జారీ చేసేలా చూడాలని ఎంపీ పురంధరీశ్వరీ నిమ్మరాజు కోరారు.



# నెల్లూరు జిల్లాలో రెండు పెద్ద పులులు

## కర్నూలు జిల్లా నుంచి ఒక పులి, నల్లమల కారిడార్ నుంచి మరో పులి జిల్లాలోకి ప్రవేశం



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 5)
నెల్లూరు జిల్లాలో పులుల సంచారం నిజమేనని జిల్లా అటవీ శాఖ అధికారి బి చంద్రశేఖర్ ధ్రువీకరించారు. ఆత్మకూరు, ఉదయగిరి, రాపూరు రేంజ్ పరిధిలో రెండు పెద్ద పులులు ఉన్నట్లు డీఎఫ్ఓ తెలిపారు. వీటిలో ఒక పులి రాపూర్ పరిధిలోని పెంచల నరసింహస్వామి కొండ ప్రాంతంలో తిరుగుతుందన్నారు. ఇది కర్నూల్ టైగర్ కారిడార్ నుంచి రెండు నెలల క్రితమే జిల్లాకు వచ్చిందని వెల్లడించారు. మరొకటి గత ఏడాది సెప్టెంబర్‌లో నల్లమల కారిడార్ నుంచి వచ్చిందని పేర్కొన్నారు. వన్యప్రాణులు సంరక్షణకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగానే పెద్ద పులులు ఇక్కడికి వస్తున్నాయని తెలిపారు. అవి సంచరించే ప్రాంతాల్లో నీటి కుంటలు, 18 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశామని డిఎఫ్ఓ బి చంద్రశేఖర్ తెలిపారు.

# కెనాడాలో బిజెపి ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్

## వైసి యోగయ్య యాదవ్ పుట్టినరోజు వేడుకలు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 5)
బిజెపి ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ వైసి యోగయ్య యాదవ్ పుట్టిన రోజు వేడుకలు కెనడాలోని తన కుటుంబ సభ్యులు భార్య, కుమార్తె, అల్లుడు, మనవరాళ్ళు మధ్య నిర్వహించుకున్నారు కుటుంబ సభ్యులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు, యోగయ్య మాట్లాడుతూ నాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతూ, కుటుంబ సభ్యుల మధ్య పుట్టినరోజు వేడుక చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

# ప్రజా సమస్యలు పరిష్కారానికి సహకరించాలి

## నెల్లూరు జిల్లా నూతన కలెక్టర్‌ను కోరిన జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 5)
శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లాకు కొత్తగా వచ్చిన కలెక్టర్ ఆనంద్‌ని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన ఐదు సంవత్సరాల వైసీపీ పరిపాలనలో మట్టి, ఇసుక,గ్రావెల్,అక్రమ రవాణా జరుగుతుందని ఎంతో మంది అధికారులకు తెలిపినా కూడా వినిపించుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ప్రజలందరూ మంచి నిర్ణయం తీసుకొని ప్రజా ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారు. ప్రజా సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి మార్గాలను చూపి సహకరించవలసిందిగా కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చిత్రపటాన్ని కూడా కార్యాలయంలో ఉంచాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ తో కార్యదర్శి ప్రశాంత్ గౌడ్, హేమచంద్ర యాదవ్, మౌనిష్, హరి, ఇషాక్, బన్నీ, తదితరులు పాల్గొన్నారు.

# మానవత స్వచ్ఛంద సంస్థ పొదిలి నూతన కార్యవర్గం ఎన్నిక

అధ్యక్ష, కార్యదర్శులుగా నాగేశ్వరరావు, అశోక్






(షణ్మణ వెలుగు, పొదిలి, జులై 5)
మానవత స్వచ్ఛంద సంస్థ పొదిలి నూతన అధ్యక్షులుగా సామంతపూడి నాగేశ్వరరావు, కార్యదర్శిగా బండి అశోక్‌లను శు క్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారివురిని శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మువ్వల పార్ధసారథి, కన్వీనర్ కల్లం సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కె. యల్ల మందా రెడ్డి,డైరెక్టర్ లు గునుపూడి చెంచు సుబ్బారావు, ఎక్కలి శేషగిరి,కరీముల్లా బేగ్, యర్రాంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, గూడూరి వినోద్, సోమిశెట్టి చిరంజీవి, బాజీ కరీముల్లా, రావూరి శ్రీకాంత్, బొగ్గవరపు శ్రీనివాస్, కుమార్, మహిళా ప్రతినిధులు సోమిశెట్టి శ్రీదేవి, వై కిరణ్మయి పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ కామాక్షిదేవి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



(షణ్మణ వెలుగు, కోవూరు, జులై 5)
శ్రీ కామాక్షి దేవి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. చివరి రోజైన అమావాస్య నాడు సముద్ర స్థానమాచరించి రామలింగేశ్వర స్వామిని దర్శించుకుంటే సకల పాపాలు తొలుతాయని జనసేన మద్దతు దారుడు సోదరుడు భార్గవ్ ఆహ్వానం మేరకు జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల స్వామి వారిని దర్శించుకున్నారు. దాదాపుగా ఐదు వందల ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన స్వామివారిని ఈ ప్రత్యేక రోజున సందర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. 25 సం.లు గా సంవత్సరాల పైబడి అభివృద్ధికి నోచుకుని కోవురు నియోజకవర్గంలో ప్రజలందరూ మద్దతు తెలిపి ప్రజా ప్రభుత్వాన్ని స్వాగతించారు. ప్రజా ప్రభుత్వం తరపున ఎన్నికైన నాయకులందరూ కోవూరు నియోజకవర్గంలో గ్రామాలకు రోడ్లు మరియు విద్య,వైద్య మౌలిక వసతులు సదుపాయాలు మెరుగుపరిచి ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు.

# మంత్రి ఆనంతో కోటంరెడ్డి భేటి



(షణ్మణ వెలుగు, నెల్లూరు, జులై 5)
రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. నెల్లూరు రూరల్ నియోజవర్గంకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి ఆయనతో చర్చించారు.

# ప్రతి చిన్నారి బడిలో ఉండాల్సిందే

**అవకాశాలను సద్వినియోగం చేసుకుని బంగారు భవిత పొందాలి**
**డీఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాల అభివృద్ధి బాధ్యత నాది**
**ఆర్వో ప్లాంటును యుద్ధప్రాతిపదికన అందుబాటులోకి తేవడంతో పాటు డైనింగ్ హాలు నిర్మాణానికి హామీ**
**పొదలకూరులోని డీఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు**
**విద్యా సామగ్రి కిట్ల పంపిణీ సందర్భంగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి**



(షణ్ముఖ వెలుగు, సర్వేపల్లి, జులై 5)
ప్రతి చిన్నారి బడిలో ఉండాల్సిందేనని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సర్వేపల్లి లోని డిఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు విద్యా సామాగ్రి కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన తొలుత డీఈఓ రామారావు, హెచ్ఎం, ఉపాధ్యాయులతో సమావేశమై సమస్యల పై చర్చించారు. 730 మంది విద్యార్థినులు చదువుతున్న ఉన్నత పాఠశాలలో డైనింగ్ హాలు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. విద్యార్థులకు క్రీడామైదానం ఏర్పాటుతో పాటు సమీపంలోని వసతి గృహాన్ని అందుబాటులోకి తేవడంపై చర్చ విద్యారంగం కోసం ప్రభుత్వం వేలాది కోట్లు ఖర్చు పెడుతోందన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి పిల్లలు బాగా చదువుకోవాలన్నారు. మూడు ఎకరాల్లో కష్టపడి పండిస్తే ఏడాదికి రూ.90 వేలు మాత్రమే మిగులుతుంది. అంటే నెలకు రూ.10 వేలు కూడా రాని పరిస్థితి ఉందన్నారు. పట్టుదలగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహిస్తే మంచి జీతాలతో జీవితంలో స్థిరపడవచ్చన్నారు. అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోండని సూచించారు. పిల్లలు బాగా చదువుకుని జీవితంలో



స్థిరపడితే తల్లిదండ్రులకు పండగే అన్నారు. ఈ విద్యాసంవత్సరంలో 10వ తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. డ్రాపవుట్స్‌లో ఎక్కువగా గిరిజన, దళిత చిన్నారులు ఉండటం బాధాకరమన్నారు. బడి ఈడు కలిగిన ప్రతి బాలుడు, బాలిక స్కూలులో ఉండేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో పాటు సహచర పిల్లలు కూడా బాధ్యత తీసుకోవాలని సోమిరెడ్డి సూచించారు.



# జగన్ పర్యటనతో వైసీపీ నాయకుల్లో ఆత్మస్థైర్యం పెరిగింది

**మీడియా సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి ఆదాల**




గురువారం నెల్లూరులో జరిగిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటన విజయవంతంపై జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం సంతోషం వ్యక్తం చేసింది. మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల రామకృష్ణారెడ్డిని పరామర్శించేందుకు నెల్లూరు సెంట్రల్ జైలుకు విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి, వైయస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటనతో జిల్లాలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులలో ఆత్మస్థైరం మరింత పెరిగిందని, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, సానుభూతిపరులకు గట్టి ధైర్యాన్ని ఇచ్చే సందేశాన్ని ఇవ్వడం పట్ల జిల్లా నాయకత్వం ఆనందం చేసింది. అదే విధంగా వైఎస్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటనపై పోలీసు నిర్లక్ష్య ప్రదర్శన తీరును జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం తప్పు పట్టింది. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు మల్లు సుధాకర్‌రెడ్డి, వైసీపీ నాయకులు మంగళపూడి శ్రీకాంత్‌రెడ్డి, సిహెచ్ హరిబాబు యాదవ్, పాశం శ్రీనివాస్, యేసు నాయుడు, రావు శ్రీనివాస్‌రావు, మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి, వారాల లక్ష్మీనారాయణ, చిల్లకూరు సుధీర్‌రెడ్డి, కొండేటి నరసింహారావు, వైవీ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 5)
నెల్లూరు మాజీ పార్లమెంట్ సభ్యులు, మాజీ మంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగా మురళీధర్, ఉదయగిరి నియోజకవర్గం వైసీపీ ఇన్చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, నెల్లూరు నగరం వైసీపీ ఇన్చార్జ్ మహమ్మద్ ఖలీల్ అహ్మద్, నెల్లూరు విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులతో కలసి పాల్గొన్నారు.

# సూళ్లూరుపేట మున్సిపాలిటీ అభివృద్ధికి అహర్నిశలు పనిచేస్తా

**ఎమ్మెల్యే నెలవల విజయ శ్రీ**

(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, జులై 5)
తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండలంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ నివాసంలో ఏర్పాటు చేసిన ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సూళ్లూరుపేట మున్సిపాలిటీలో తాగునీటి సమస్య పై మున్సిపాలిటీ అధికారులతో సమావేశం నిర్వహించి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గం చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలోని అభివృద్ధి చెందిందని, గత ఐదేళ్లలో అభివృద్ధిని మరిచారని తెలిపారు. మున్సిపాలిటీలో తాగునీటి, డ్రైనేజీ, సిసి రోడ్లు, ప్రతిపాదనలు పంపామని త్వరలో అన్ని సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. చంద్రబాబు నాయుడు ఒక విజన్ ఉన్న నాయకుడని తెలిపారు. జగన్ దోచుకోవడం దాచుకోవడం తప్పఅభివృద్ధిపై దృష్టి పెట్టలేదని తెలిపారు. చంద్రబాబు నాయుడు ఒక విజన్ ఉన్న నాయకుడు ప్రజలు అత్యధిక మెజార్టీతో తెలిపారు. ఆరు మండలాల్లో ఏ సమస్య ఉన్న తన వద్దకు రావాలని, ప్రతి సమస్య తీర్చే విధంగా అడుగులు వేస్తామని తెలిపారు. జగన్ చేసే తాటాకు చప్పుళ్ళకు భయపడే ప్రసక్తే లేదని, నారా చంద్రబాబునాయుడు ఓడించే సత్తా జగన్మోహన్‌రెడ్డికి లేదని ఎద్దేవా చేశారు.



# మార్కండేశ్వర స్వామికి అన్నాభిషేకం



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జులై 5)
ఆరుద్ర నక్షత్రం శివుని జన్మ నక్షత్రం అమావాస్య అయినందున మార్కాపురం శ్రీ జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి వారి ఆలయంలో సాయంత్రం ప్రదోషకాలంలో మార్కండేశ్వర స్వామి వారికి 15 కేజీల అన్నముతో అన్నాభిషేకం ప్రసాద వితరణ జరిగింది. ప్రసాద దాతలు హైదరాబాదు వాస్తవ్యులు గోపాలకృష్ణ శకుంతల, మార్కాపురం వాస్తవ్యులు వడ్లమాని శ్రీనివాసు దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు విరివిగా పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ప్రధాన అర్చకులు వేలూరి ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం జరిగింది.



# జగన్‌తో నీతులు చెప్పించుకునే స్థితిలో లేము

## పాత కేసులు అన్ని తిరగతోడుతాం

## అక్రమాలకు అండగా నిలిచిన వారు విచారణ ఎదుర్కోవాల్సిందే



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, జూలై 5)

పులివెందుల ఎమ్మెల్యే దమ్ముంటే మాచర్లకు వస్తే మీ సుద్దపూస ఉంగరాల బ్రదర్స్, గుడుంబా శంకర్‌లు మాచర్లను చెర పట్టిన అక్రమాలు, అన్యాయాలు ఆధారాలతో సహా చూపిస్తానని ఓ వేదిక ఏర్పాటు చేయమంటావా అంటూ మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్ రెడ్డికి సవాల్ విసిరారు. రాష్ట్రంలో బడుగు,బలహీన వర్గాలపై దాడులు జరుగుతున్న సమయంలో చిక్కటి చిరునవ్వులు చిందించిన జగన్ తన దోపిడి ముఠాలో సభ్యుడికి కబ్జాకోరుకు అన్యాయం జరిగిందంటూ బయటకు వచ్చి మాట్లాడటం మాజీ ముఖ్యమంత్రికి సిగ్గుచేటు అన్నారు. జగన్‌తో నీతులు చెప్పించుకునే స్థితిలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు లేరని అన్నారు. ప్రజలకు మంచి చేసినా తాను ఓడి పోయారని చెప్పడం జగన్ దివాలాకోరుతనానికి నిదర్శనం అన్నారు. ఏ వర్గానికి న్యాయం చేశాడు చెప్పాలన్నారు. యువతను గంజాయికు బానిస చేసి గంజాయి మాటున వ్యాపారం చేసి వైసిపి నాయకులు కోట్లు గడించారని అన్నారు. అమరావతిపై కక్షగట్టి భావన నిర్మాణ రంగంపై ఆధారపడి జీవిస్తున్న అనేకమంది బడుగు, బలహీనవర్గాల వారి పొట్ట కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తన స్వప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి దివాలా తీయించిన ఘనత జగన్ అని అన్నారు. రైతులకు గురించి మాట్లాడే అర్హత జగన్కు లేదని 3500 కోట్ల రూపాయలతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి ఆదుకుంటానని వాగ్దానం చేసిన జగన్ ఎంతమంది రైతులని ఆదుకున్నారని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని లక్షల కోట్ల అప్పులు పాలు చేసి ఆగాధం సృష్టించారని విమర్శించారు. రాష్ట్రంలో ఒక్క ఎకరాకైనా సాగు నీరు ఇచ్చావా జగన్ అంటూ ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని మాచర్ల లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని నీ రౌడీ మూకలతో దాడులు చేయించి ధ్వంసం చేయించావు ప్రజాధనంతో నిర్మించిన ప్రజా వేదికను కూల్చి సైకో ఆనందం పొందిన జగన్ మా పార్టీ ఆఫీసులపై ధ్వంసం చేసి దాడులు చేసిన వారిపై కేసులు పెడితే నేటి వరకు చర్యలు లేవు అని వీటిపై సమగ్ర విచారణ చేపడతామన్నారు. పాత కేసులన్నీ తిరగ తోడుతామని వైసిపి అవినీతి అక్రమాలకు కబ్జాలకు తొత్తులుగా ఉన్న అధికారులు విచారణ ఎదుర్కొక తప్పదు అన్నారు. జగన్ ఉడత ఊపులకు తెలుగుదేశం పార్టీ భయపడదన్నారు. రాష్ట్ర ఖజానాను దోచుకున్నావ్ వారు ఏ స్థాయిలో ఉన్న ఎంతటి వారైనా వారి సహకరించిన వారు సైతం జైలుకు వెళ్లక తప్పదు అని అన్నారు. 99 శాతం హామీలను అమలు చేసిన ఓడిపోయినాము అంటున్న జగన్ ఆ ఒక్క శాతం హామీ ఏమిటో ప్రజలకు తెలిపితే మేము తెలుసుకుంటామని అన్నారు. వైసీపీలో దోపిడీ చేయటమే మంచితనమా, గ్రానైట్ ప్రభుత్వ ఆస్తులు ప్రైవేట్ ఆస్తులు దోపిడీ చేసిన వ్యక్తిని మంచివాడు శుద్ధ పూస అంటూ మాట్లాడిన జగన్ తన యొక్క నైజాన్ని రాష్ట్ర ప్రజలకు తెలియజేశారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నో అవమానాలు, వేధింపులు, దాడులకు గురయ్యారని, కానీ మా అధినేత ఆదేశాల మేరకు ఎక్కడ రెచ్చగొట్టే కార్యక్రమాలు చేయలేదని అన్నారు. నువ్వు చేసిన విధానాలు మా పార్టీ అధినేత అవలంబిస్తే ఇప్పటికే వైసిపి కార్యకర్తలు,నాయకులు రాష్ట్రం విడిచి వెళ్లి ఉండేవారని అన్నారు.

నెలరోజులు కూడా పూర్తిగానే ప్రభుత్వంపై అభండాలు వేయటం వారి రాజకీయ పరిపక్వతకు నిదర్శనమన్నారు. ఎన్నికల తర్వాత మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి పరామర్శకు వెళ్ళాడని జగన్ అనటం ప్రజలను అమాయకులను చేయటమేనన్నారు పరామర్శలకు వెళ్లే వారు కత్తులు రాడ్లు, గొడ్డళ్లు, బీరు బాటిళ్లు తీసుకుని ముఖాలు కనిపించకుండా మారువేషాలలో వెళ్తారా అని ప్రశ్నించారు. పత్రికా సమావేశంలో పట్టణ అధ్యక్షులు కొమ్మర దుర్గారావు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాతులూరు కుమార్ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు మున్నా రాంబాబు యాదవ్, కౌన్సిలర్ మదర్ సాహెబ్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మద్దికపు వెంకట్రామిరెడ్డి, నేరెళ్ల వీరస్వామి, గుండాల శ్రీనివాస్ యాదవ్, ఎనుముల కేశవరెడ్డి, సురేష్ ,అంజి, లాలా వినోద్, తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అలరించిన యుగళావధానం





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూలై 7)

విశ్వ కళాభారతి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఒంగోలు జిల్లా కేంద్ర గ్రంధాలయంలో ఏర్పాటైన మానేపల్లి నాగ కుమార శర్మ, ఇలపావులూరి శేష శ్రీధర శర్మల యుగళావధానం కార్యక్రమం సాహిత్యాభిమానులకు రసానందాన్ని పంచి పెట్టింది. పృచ్ఛకుల ప్రశ్నలకు అవధానులు చక్కటి పూరణలు చెప్పి అలరించారు. భారతీయ సనాతన ధర్మ పరిరక్షణకు విశ్వ కళా భారతి సంస్థ అధ్యక్షులు నాదెండ్ల జ్వాలా ఉమామహేశ్వరశర్మ చేస్తున్న కృషిని వక్తలు అభినందించారు. అవధానంలో పృచ్ఛకులుగా శతావధాని నారాయణం బాలసుబ్రహ్మణ్యం, దూపాటి రామాచార్యులు, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, పొన్నూరు వెంకట శ్రీనివాసులు, ఎంవిఎస్ శాస్త్రి, ఈదుమూడి ఆంజనేయులు, పింగళి పూర్ణచంద్రరావు, పింగళి శ్రీనివాస రావు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా అవధాని ఇలపావులూరి శేష శ్రీధర శర్మను అవధాన కళావతంస బిరుదుతో ఘనంగా సన్మానించారు . ఆళ్ల సుబ్బారెడ్డి, శ్రీలత దంపతులు జ్యోతి ప్రజ్వలన చేశారు. జిల్లా కేంద్ర గ్రంధాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలుగు భాషా సాహిత్యాల పరిరక్షణకు అవధాన విద్యా వ్యాప్తికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదిలక్ష్మి కోరారు. యువగళావధానం కార్యక్రమాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో సాహిత్యాభిమానులు విచ్చేసారు. విశ్వ కళాభారతి సంస్థ అధ్యక్షులు నాదెండ్ల జ్వాలా ఉమా మహేశ్వరశర్మ అవధానులను, పృచ్ఛకులను ముఖ్య అతిథులను జ్ఞాపికలతో సత్కరించారు. పొన్నూరు వేంకట శ్రీనివాసులు అప్రస్తుత ప్రసంగం ఆకట్టుకుంది.

# నేడు బ్రిలియంట్ మెగా ఎడ్యుకేషన్ ఫెయిర్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూలై 5)



బ్రిలియంట్ మెగా ఎడ్యుకేషన్ ఫెయిర్ శనివారం ఉదయం 9 గంటలకు స్థానిక ఏ వన్ ఫంక్షన్ హాల్లో ప్రారంభమవుతుందని డాక్టర్ షేక్ న్యామతుల్లా భాష, బ్రిలియంట్ కంప్యూటర్స్ అధినేత, డాక్టర్ షేక్ తాహూరా తెలిపారు. ప్రతి ఏడాది బ్రిలియంట్ సంస్థ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ కార్యక్రమం విద్యార్థులకు, నిరుద్యోగులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి దేశంలోని అనేక యూనివర్సిటీల ప్రొఫెసర్లు, యాజమాన్యాలు, యాజమాన్య ప్రతినిధులు, వివిధ రంగాలలో నిష్ణాతులైన ప్రముఖులు, హాజరై సూచనలు సలహాలు అందిస్తారన్నారు. ఇంజనీరింగ్ కోర్సులు, మెడికల్ కోర్సులు, డిగ్రీ కోర్సులు ఏ ఏ యూనివర్సిటీల్లో అందుబాటులో ఉన్నాయి, వాటిని విద్యార్థులు ఎలా సద్వినియోగం చేసుకోవచ్చు అనేది ఈ కార్యక్రమంలో విద్యార్థులు తెలుసుకోవచ్చని సూచించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు, జిల్లా కలెక్టర్ ఎ అమీమ్ తన్సారియా, రిటైర్డ్ డీజీపీ కేఆర్ఎం కిషోర్‌కుమార్ తదితరులు హాజరవుతారని వెల్లడించారు. నూతన కోర్సులు కూడా వివరాలు తెలుసుకోవచ్చని, త్వరలో జరగబోయే ఇంజనీరింగ్, నీట్ సంబంధించి వెబ్ కౌన్సిలింగ్ పై కూడా ఈ కార్యక్రమంలో అవగాహన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో లక్కీ డిప్ ద్వారా ఇద్దరికి ఉచితంగా లాప్‌ట్యాప్‌లు కూడా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలో ఉన్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు డాక్టర్ షేక్ న్యామతుల్లా భాష, బ్రిలియంట్ కంప్యూటర్స్ అధినేత, డాక్టర్ షేక్ తాహూరా తెలిపారు.

# మంత్రులు ఆనం, నారాయణలను కలిసిన నూతన కలెక్టర్ ఆనంద్

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూలై 5)

రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణను జిల్లా కలెక్టర్ ఒ. ఆనంద్ మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. నగరంలోని సంతపేటలో గల క్యాంపు కార్యాలయంలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పొంగూరు నారాయణలను ఆయన కలిసారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా కలెక్టర్ ఆనంద్‌కు జిల్లా అభివృద్ధికి సంబంధించిన పలు విషయాలపై మంత్రులు పలు సూచనలు చేశారు.





# స్థలాన్ని ఆక్రమించడం చట్ట విరుద్ధం





(షణ్ముఖ వెలుగు, మామిడూరు, జూలై 5)

మామిడూరు గ్రామంలో గతంలో మూడు సంవత్సరాల క్రితం పాత సొసైటీ బిల్డింగ్‌ని పడగొట్టి కొంతకాలం అక్కడ రెండు రూములను పారిజాతం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్రమంగా పంచాయతీ తీర్మానం ద్వారా స్కూల్ భవనాన్ని ఏర్పాటు చేసి ప్రాథమిక పాఠశాల నడపడం జరిగింది. ప్రస్తుతం ఆ పాఠశాల విద్యార్థులు లేక మూతపడగా ఏర్పాటు చేసిన పారిజాతం చారిటబుల్ ట్రస్టు వారు అసలు ఇక్కడ ఆ స్థలాన్ని పూర్తిగా ఆక్రమించుకుని చేయడం చట్ట విరుద్ధమని దీనిపైన విచారణ జరగాలంటూ స్థానిక మండల విద్యాశాఖ అధికారికి గ్రామస్తులు వివరించారు. ఈ మేరకు మండల విద్యాశాఖ అధికారి డిసి మస్తానయ్య ఆ స్కూలు భవనాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ పరిశీలనలో ఆయన వెంట గ్రామస్తులు భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు కుంకు బాలయ్య నాయుడు, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు అల్లంపాటి నారాయణరెడ్డి ఉన్నారు.

# వాహనదారులకు అవగాహన





(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూలై 5)

జిల్లా ఎస్పీ ఉత్తర్వులు మేరకు హెల్మెట్ లేకుండా వాహనాల నడిపే వాహనదారులకు, ట్రిపుల్ రైడింగ్ చేసే వాహనదారులకు పొదిలి టౌన్‌లోని ఎస్‌వికెపి డిగ్రీ కాలేజ్ వద్ద పొదిలి ఎస్ఐ జి కోటయ్య సిబ్బందితో కలిసి శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. బైక్ నడిపే వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించవలెనన్నారు. ట్రిపుల్ రైడింగ్ చేయరాదన్నారు. వాహనదారులందరూ మోటార్ వెహికల్ ఆక్ట్ రూల్స్‌ను తప్పనిసరిగా పాటించాలని, లేనిచో అట్టి వారిపై చట్టపరంగా తగిన జరిమానా విధించబడుతుందన్నారు. ర్యాష్ డ్రైవింగ్ చేసే వెహికల్స్‌ను సీజ్ చేయడం జరుగుతుందన్నారు.

# అజీజ్‌తో మంత్రి నారాయణ భేటీ

**టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రి నారాయణ**

**నారాయణను శాలువాలతో సత్కరించిన అజీజ్ సోదరులు**

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూలై 5)

టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు షేక్ అబ్దుల్ అజీజ్‌తో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ భేటీ అయ్యారు. నెల్లూరులోని అబ్దుల్ అజీజ్ నివాసానికి మంత్రి నారాయణ చేరుకొని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణని అజీజ్, ఆయన సోదరుడు, అబ్దుల్ జలీల్‌లు శాలువాతో సత్కరించారు. అనంతరం పలు విషయాలపై అజీజ్, నారాయణలు సుదీర్ఘంగా చర్చించారు. ఈ భేటీలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనూరాధ, మాజీ జడ్పీటీసీ ముప్పాళ్ల విజేత, నగర అధ్యక్షుడు మామిడాల మధు, టీడీపీ ముఖ్య నేతలు ఉన్నారు.

# జగన్ పర్యటనతో జోష్

## మాజీ మంత్రి కాకాణి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 5)

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటన వైకాపా నాయకులు, కార్యకర్తలలో జోష్ నింపిందని మాజీ మంత్రి కాకాణి గోవర్దన్ రెడ్డి అన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వై యస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటనలో చంద్రబాబు ప్రభుత్వం లేకి ధోరణిని అవలంభించిందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ప్రభుత్వం జగన్ పర్యటనకు జనాలు రాకుండా నిరోధించడంలో పెట్టిన దృష్టి, మాజీ ముఖ్యమంత్రి భద్రతలో పెట్టలేదన్నారు. జులై 4న జగన్మోహన్ రెడ్డి నెల్లూరు పర్యటనను ఖరారు చేశారు. వైసిపి జిల్లా నాయకులందరూ భద్రత దృష్ట్యా పోలీస్ పెరేడ్ గ్రౌండ్ హెలిప్యాడ్‌ను ఎంపిక చేశారు. పోలీస్ యంత్రాంగం అనుమతులు ఇవ్వకుండా, కాలాయాపన చేసిందన్నారు. చివరకు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లోని హెలిప్యాడ్ కు అనుమతులు నిరాకరించారన్నారు. ప్రత్యామ్నాయంగా కనుపర్తిపాడు జిల్లా పరిషత్ హెలిప్యాడ్‌ను పరిశీలించి, అనుమతులు కోరగా, అతి కష్టం మీద అనుమతులు ఇచ్చారన్నారు. పోలీసులు జనాన్ని జగన్ పర్యటనలో పాల్గొన్నకుండా, అడుగడుగున నియంత్రించారు, అయినా వేలాదిగా జనం జగన్మోహన్ రెడ్డి కోసం వచ్చారన్నారు. చంద్రబాబు పర్యటనతో జగన్మోహన్ రెడ్డి పర్యటనను పోలీసులు బేరీజు వేసుకొని, జనం పెద్దగా రారని అనుకున్నట్లున్నారు. పోలీసులు కనీస భద్రత ఇవ్వకుండా, నామ మాత్రంగా ఇవ్వడం జరిగిందన్నారు. పోలీసులు కంట్రోల్ చేయలేనంత జనం జగన్మోహన్‌రెడ్డి పర్యటనకు రావడంతో నామమాత్రంగా ఉన్న పోలీస్ యంత్రాంగం జనాన్ని నియంత్రించడంలో వైఫల్యం చెందిందన్నారు. పోలీసులు జనాలు రావడానికి నిరోధించడంలో పెట్టిన శ్రద్ధ, భద్రతలో పెట్టలేకపోయారన్నారు. జగన్మోహన్‌రెడ్డి జనాదరణను చూసి, భద్రత కల్పించలేక జైలు సూపరింటెండెంట్ ములాఖత్ ను రద్దు చేస్తున్నామని చివరి నిమిషాల్లో తెలియజేశారు. జైళ్ల శాఖ నియమ,నిబంధనల ప్రకారం జగన్మోహన్ రెడ్డి ములాఖాత్‌కు అనుమతులు ఇచ్చారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ఎటువంటి ఉదారత చూపలేదు, మేము కోరలేదన్నారు. ములాఖాత్‌కు అనుమతి లేదని జైలు దగ్గరికి వెళ్లకుండా జగన్మోహన్ రెడ్డి ని హెలిప్యాడ్ వద్ద ఆపేందుకు ప్రయత్నాలు చేశారన్నారు. జగన్మోహన్ రెడ్డి కోసం వచ్చిన వేలాది మంది జనాన్ని చూసి, పోలీసులు సైతం వెనుకకు తగ్గిన పరిస్థితి ఏర్పడిందన్నారు. చివరి నిమిషంలో జగన్మోహన్ రెడ్డిని ములాఖాత్‌కు జైళ్ల శాఖ అనుమతించిందన్నారు. జగన్మోహన్ రెడ్డి పర్యటనను అడుగడుగునా అడ్డుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. జగన్మోహన్ రెడ్డి ప్రెస్ మీట్‌పై కొన్ని ఏలిక పాములు లేచి ఆడాయి, వాటిని పట్టించుకోవల్సిన అవసరం లేదని తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఈవీయంలను రిగ్గింగ్ చేస్తుంటే, పిన్నెల్లి అడ్డుకున్నారని జగన్మోహన్ రెడ్డి మాట్లాడారు. ఈవియం కేసులో పిన్నెలికి హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. రామకృష్ణారెడ్డి పై పోలీసులు పెట్టిన అక్రమ కేసు, హత్యాయత్నం కేసులో నేడు జైల్లో ఉన్నారు. ఈవీఎం ధ్వంసం కేసులో ఏం జరిగిందో సాక్ష్య ధారాలు ఉన్నాయి. జైళ్లకు, కేసులకు భయపడం ప్రజలకు అండగా నిలబడతామన్నారు. అధికారం వచ్చిన నెల రోజుల్లోపే వైసిపికి సంబంధించిన నాయకులపై, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించడం, వారిపై దాడులు చేయడం తెలుగుదేశం ప్రభుత్వానికి మామూలు అయింది. మాపై దాడులు చేస్తే, తిరిగి ప్రతిఘటిస్తామని జగన్మోహన్‌రెడ్డి హెచ్చరించారని తెలిపారు.

మేము దాడులు చేస్తాం, మీరు ప్రతిఘటించకూడదని తెలుగుదేశం నాయకులు చెప్పదల్చారా, అందుకే జగన్మోహన్‌రెడ్డి మాటలను వక్రీకరిస్తున్నారా, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన వారిపై దాడులు చేస్తే, ప్రతిఘటన తీవ్రంగా ఉంటుందన్నారు. జగన్మోహన్ రెడ్డికి ప్రజల్లో చెక్కుచెదరని ఆదరణ ఉందని నెల్లూరు పర్యటన నిరూపించిందని కాకాణి అన్నారు.

కాకాణి గోవర్ధన్ రెడ్డితో పాటు విలేకరుల సమావేశంలో శాసనమండలి సభ్యులు, వైసిపి జిల్లా పార్టీ అధ్యక్షులు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, శాసనమండలి సభ్యులు మేరిగ మురళీధర్, మాజీ మంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి ఇన్చార్జ్ మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, నెల్లూరు నగర్ ఇన్‌ఛార్జి మహమ్మద్ ఖలీల్, మాజీ డైరీ కోఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ చిల్లకూరు సుధీర్‌రెడ్డి, విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ పై అవగాహన





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 5)

ఉదయం బయటికి వచ్చిన నుండి రోడ్డుపై ఎన్నో ప్రమాదాలు చూస్తున్నామని, అనేక ప్రమాదాలకు గురై ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని టూ టౌన్ సి.ఐ జగదీష్ అన్నారు. ఈ శుక్రవారం ఒంగోలు నగరంలోని కలెక్టరేట్ సమీపంలో వాహనదారులకు హెల్మెట్ పై అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా వాహనం నడపడం వల్ల ఎన్నో ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారని, ప్రాణాలు కోల్పోతున్నారని కచ్చితంగా ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, త్రిబుల్ రైడ్ కూడా చేయవద్దని, తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపే వాళ్లకు ఫైన్‌లు వేసి కోర్టులో హాజరు పరుస్తామని సీఐ జగదీష్ తెలిపారు. ఆయనతో పాటు టూ టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## దామచర్లను కలిసిన కనగాల






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 5)

ఆపదలో ఉన్న ఆంధ్ర రాష్ట్రాన్ని రక్షించటానికి రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడుని, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబును అఖండ మెజార్టీతో గెలిపించి నందుకు బాపట్ల జిల్లా కొల్లూరు గ్రామం నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం వరకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కనగాల మధుసూధన్ ప్రసాద్ , టిడిపి బృందంతో మహా పాదయాత్ర చేపట్టారు. దానిలో భాగంగా శుక్రవారం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌ని కలవడం జరిగింది. అనంతరం పాదయాత్రలో వాళ్లకు కావాల్సిన ఏర్పాట్లు చేశారు.

## చట్టంపై అవగాహన ఉన్న విద్యావంతున్ని సామాజిక కార్యకర్తను ఆర్‌టిఐ యాక్ట్ కమిషనర్‌గా నియమించండి




(షణ్ముఖ వెలుగు, వరదయ్యపాలెం, జులై 5)

కౌన్సిల్ ఫర్ సిటిజెన్ రైట్స్ (సిసిఆర్)తిరుపతి జిల్లా నుంచి లీగల్ అడ్వయిజర్ దినేష్, జిల్లా కో ఆర్డినేటర్, మాజీ సైనిక ఉద్యోగి మార్కండేయరెడ్డి, మహిళా అధ్యక్షురాలు కె గిరిజ, రాష్ట్ర కమిటీ సభ్యులు తులసీదాస్, ఏపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ గుత్తి త్యాగరాజు, జి శిరీష్ బాబు, వారి వారి ప్రాంతం నుండి లేఖలు రాసి, భారత తపాల శాఖ ద్వారా రిజిస్టర్ పోస్ట్ చేసి తెలంగాణ గవర్నర్‌కు, రాష్ట్ర ముఖ్యమంత్రికి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి పంపడం జరిగిందని సీసీఆర్ జెఎస్ గుత్తి త్యాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఉభయ తెలుగు రాష్ట్రలలో సీసీఆర్ అను సంస్థ ద్వారా, గ్రామీణ ప్రజలకు సైతం అవగాహన కలిగే రీతిలో చేపడుతున్న కార్యక్రమాల వివరాలను లేఖలో పొందుపరిచారు. అనేక చోట్ల చేపట్టిన రికార్డుల పరిశీలనలో వెలుగు చుసిన అంశాల గురించి కూడా లేఖలో పేర్కొన్నారు. ఏది ఏమైనప్పటికీ సమాచార హక్కు చట్టం పట్ల పూర్తి స్థాయిలో ప్రజలు అవగాహన పెంచుకుని, ప్రభుత్వం వద్ద, ప్రభుత్వ అధికారులు వద్ద జవాబు దారి తీసుకురావడం, తద్వారా రాష్ట్ర అభివృద్ధికి తొడ్పాడుటకు సరైన సమయంలో, సరైన నిర్ణయం తీసుకోవలసిన అవసరం కోసం,కౌన్సిల్ ఫర్ సిటిజెన్ రైట్స్ వ్యవస్థపాక అధ్యక్షులు మంచికట్ల అనిల్ కుమార్ పేరును, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంకు సిపారసు చేస్తూ లేఖను పంపడం జరిగిందని,ఇలా ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి అనేకమంది సిపారసు లేఖలు పంపారని సీసీఆర్ జెఎస్ గుత్తి త్యాగరాజు తెలిపారు. చట్టం పట్ల అవగాహన లేని వారిని కమిషనర్‌గా నియమించడం వల్ల, వారు వాటిని గురించి తెలుసుకునే లోపే వారికి ఉన్న సమయంలో 70% పూర్తి అవుతుందని, దీని ద్వారా ప్రభుత్వ ఆశయంకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. మరికొందరు వారిని తప్పు దారి పట్టించే అవకాశం ఎక్కువగా ఉందని, దాని వలన ప్రభుత్వం అప్రతిష్ట మూట కట్టుకోవాల్సి వస్తుందని సీసీఆర్ తిరుపతి జిల్లా సభ్యులు కొందరు తమ అభిప్రాయం వెలిబుచ్చారు. విజయవాడ కేంద్రంగా రాష్ట్ర స్థాయి సీసీఆర్ కార్యాలయంను ప్రారంభించే దిశగా రాష్ట్ర సీసీఆర్ ప్రతినిధులు అడుగులు వేస్తున్నట్టు తెలిపారు.

## పేద విద్యార్థులకు సూర్య శ్రీ ట్రస్ట్ అండ

### సూర్యశ్రీ ట్రస్ట్ సేవలు అభినందనీయం

### మారెళ్ళ సుబ్బారావు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 5)

సూర్య శ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ సెక్రటరీ షేక్ సర్దార్ భాష ఆధ్వర్యంలో పేద విద్యార్థి షేక్ సలాంకు ప్రవాస భారతీయుడు ఖాజా హుస్సేన్ కందుకూర్ ఆర్థిక సహకారంతో ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ చదువుకు అవసరమైన పుస్తకాలు, బట్టలు శుక్రవారం ట్రస్టు కార్యాలయంలో ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు ద్వారా అందజేశారు. సర్దార్ మాట్లాడుతూ బాగా చదువుతున్న పేద విద్యార్థులకు సూర్య శ్రీ ట్రస్ట్ ఆర్థికంగా అండగా ఉంటుందని తెలిపారు. ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ ఒంగోలు బండ్ల మిట్ట చెందిన సలాం పదో తరగతిలో 90 శాతం మార్కులు సాధించి చదువుల్లో బాగా రాణిస్తున్నాడు. ఈ అబ్బాయికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తల్లి చనిపోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాడు. ట్రస్ట్ సెక్రెటరీ సర్దార్ బాషాను సంప్రదించగా సలాంకు అవసరమైన పుస్తకాలు బట్టలు అందించారు. భవిష్యత్తులో ఉన్నత చదువులకు ట్రస్టు అండగా ఉంటుందని తెలిపారు. ఈ సేవ కార్యక్రమంలో మోటుపల్లి వెంకటేశ్వర్లు (చౌదరి), ట్రస్టులోని దివ్యాంగులు, తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు కావాలంటే భారీగా ముట్టచెప్పాలి

### నెల్లూరు, చిత్తూరు జిల్లాల పరిశ్రమలు ఇన్స్‌పెక్టర్ శివ శంకర్‌రెడ్డి తీరు ఇది

### నాడు వైసీపీ ప్రభుత్వంలో యథేచ్ఛగా అక్రమ సంపాదన

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 5)

శివ శంకర్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రికి సమీప బంధువు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి నెల్లూరు, చిత్తూరు జిల్లాలో పరిశ్రమల ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. అనతికాలంలోనే వందల కోట్ల కు పడగాలెట్టాడు.. పరిశ్రమలకు అనుమతులు కావాలంటే భారీగా అతడికి ముట్టచెప్పాలి. ఎన్నో కీలకమైన పరిశ్రమలు నెల్లూరు, చిత్తూరు జిల్లాలో ఉన్నాయి. అటువంటి కీలకమైన జిల్లాలో ఆయన బాధ్యతలు చేపట్టిన దగ్గర నుంచి డబ్బే..డబ్బు. భారీగా డబ్బు ఇస్తే పరిశ్రమ పెట్టుకోడానికి టక్కుమని అనుమతి లేకుంటే వంద కొర్రీలు పెట్టి ఆ ఫైల్ నిలుపుదల. ఇదీ ఆయన తీరు. పరిశ్రమల యాజమాన్యాన్ని ఇబ్బందులు పెట్టి, హింసించి 100కోట్ల కు పైగా పోగు చేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆయన స్థాయికి 100 కోట్లు అంటే ఉతారుగా..ఇంకా అంతకు రెట్టింపు ఆయన అక్రమ సంపాదన ఉందని ప్రజల వాదన. అధికారం ఉన్నని రోజులు జలగలు నెత్తురు తాగినట్లు..శివ శంకర్ రెడ్డి డబ్బును తిన్నాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. శివ శంకర్ రెడ్డి పై అవినీతి నిరోధక శాఖ దాడులు చేస్తే అసలు ఆయన అక్రమ సంపాదన బట్టబయలు అవుతుందని పలువురు సూచిస్తున్నారు. అతను చేసే ఉద్యోగం..అతని రాయల్టీ లైఫ్ కి సంబంధం ఉండదు. అతని పై స్థాయి అధికారులను సైతం అతని మొకాటి బిర్రుతో అణగదొక్కి నేను రాజు అన్న తీరుతో వ్యవహరించారు. ఐదేళ్ల పాలలో ఇష్టానుసారంగా వ్యవహరించి అందినకాడికి దోచుకున్నారు. ఎన్నో పరిశ్రమలు దగ్గర లెక్కలేనంతా వసూలు చేసి, పరిశ్రమల శాఖలో వసూలు దాదాగా పేరు ప్రఖ్యాతులు పొందారు. ఇప్పుడు అధికారం కోల్పోవడంతో ఆయన అక్రమ సంపాదనకు తెర పడుతుందా..అలాగే మూడు పువ్వులు ఆరు కాయల లాగా సాగుతుందా అసలు ఆయన అవినీతి బట్టబయలు అవుతుందో వేచి చూడాలి. శివ శంకర్‌రెడ్డి అవినీతి మీదా అవినీతి నిరోధకశాఖ, రాష్ట్ర పరిశ్రమల అధికారులు, రాష్ట్ర పరిశ్రమల మంత్రి దృష్టికి బండి వేణుగోపాల్‌రెడ్డి తీసుకెళ్లి అతని అరాచకాలకు బ్రేకులు వేయనున్నారు.

# పొదలకూరు ఆస్పత్రిలో మరిన్ని వసతులు

## డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు

### ప్రజలను వైద్యాధికారులు సొంత కుటుంబ సభ్యులుగా భావించి సేవలందించాలి

### ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం సందర్భంగా

### సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి









**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 5)**

పొదలకూరు ఆస్పత్రిలో మరిన్ని వసతులు, డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. ప్రజలను వైద్యాధికారులు సొంత కుటుంబ సభ్యులుగా భావించి సేవలందించాలని సూచించారు. తొలుత పొదలకూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (ఆస్పత్రి)లోని అన్ని విభాగాలను సోమిరెడ్డి పరిశీలించారు. సమస్యలు, అవసరమైన సౌకర్యాలపై ఆరా తీశారు. వైద్య రంగానికి సంబంధించిన అన్ని సమస్యలను మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఐదారు మండలాలకు కూడలిగా ఉన్న పొదలకూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటరులో అందిస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. ప్రతి నెలా వేలాది మంది ఇక్కడ వైద్యసేవలను సద్వినియోగం చేసుకుంటుండటం శుభపరిణామని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆస్పత్రిలో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. డయాలసిస్ సేవల కోసం ఈ ప్రాంత ప్రజలు వ్యయప్రయాసలకు ఓర్చి నెల్లూరుకు వెళుతున్న విషయం నా దృష్టికి వచ్చిందన్నారు. పొదలకూరు ఆస్పత్రిలోనే డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపడుతామన్నారు. మహ్మదాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం పనులకు పూర్తి చేసేందుకు అసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతోనూ సమీక్ష నిర్వహించి అవసరాలను తెలుసుకుంటామన్నారు.

ప్రతి సమస్యపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో చర్చించి ఆస్పత్రుల్లో ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ కుప్పకూలిపోయాయన్నారు. జిల్లాలోని ప్రజా ప్రతినిధులందరం కలిసి అన్ని సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలోని పరిస్థితులను గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రమిస్తున్నారని సోమిరెడ్డి తెలిపారు.

# ఘనంగా జరిగిన పదవీ విరమణ ఆత్మీయ సభ





**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 5)**





జిల్లా గ్రంథాలయ సంస్థలో 37 సంవత్సరాలు పనిచేసి పదవీ విరమణ చేసిన గుడిపాటి శ్రీనివాసరావు, అడ్డగడ రమేష్ బాబు పావులూరి జానకీ రామారావు, బత్తిన కోటేశ్వరరావులకు ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం ఆద్వర్యంలో జిల్లా కేంద్ర గ్రంథాలయములో ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అద్యక్షులుగా దొండపాటి వెంకట సుబ్బారెడ్డి అద్యక్షత వహించారు. ప్రత్యక ఆహ్వానితులుగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శ్రీమతి కాసు ఆదిలక్ష్మి ,రాష్ట్ర సంఘం అద్యక్షులు పాలకొలను వెంకట సుబ్బటెడ్డీ మరియు రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పేరయ్య హాజరైనారు , ఈ కార్యక్రమం జిల్లా లో ఎన్నడూ లేనివిదంగా కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి ఉద్యోగులందరికి పట్టువస్త్రాలతో వారిని సన్మానించి షీల్డ్ బహుకరించారు కార్యక్రమములో పాల్గొన్న రాష్ట్ర సంఘం అద్యక్షులు సుబ్బారెడ్డి మాట్లాడుతూ జిల్లా లో ఉద్యోగులు అందరుకూడా ఒక అన్నదమ్ములుగా కలసి పనిచేశామని కానీ మాలోని 4 గురు పదవీవిరమణ చేయటం కొంత ఇబ్బంది అనిపించినా అనివార్యము కాబట్టి వారికి ఘనంగా సన్మానించటం జరిగినది అనిచెప్పారు. రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పేరయ్య మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయ ఉద్యోగులు ఎంతో క్రమశిక్షణతో తమ వృత్తి ధర్మాన్ని నిర్వహిస్తుంటారని అందుకే వారిని సన్మానించటం నా భాద్యతగా భావించి సన్మానం చేయటం జరిగినదని చెప్పారు. జిల్లా అద్యక్షులు సుబ్బారెడ్డి మాట్లాడుతూ మాతోటి పనిచేసే మిత్రులను సన్మానించు కోవటం మా అదృష్టంగా భావిస్తున్నామన్నారు. తదుపరి మాట్లాడిన చాలా మంది ఈ రోజు జరిగిన కార్యక్రమమం మా సర్వీస్‌లో చూడలేదన్నారు. ఈ ఘనత అంతా కార్యదర్శి ఆదిలక్ష్మి, కార్యక్రమం నిర్వహించిన ఉద్యోగుల సంఘందే అన్నారు. అదే విధంగా తమకి జరిగిన సన్మానానికి పై నలుగురు కూడా చాలా సంతోషం వ్యక్తం చేశారు. ఎంతో కన్నుల పండుగల జరిగిన ఈ కార్యక్రమానికి 120 మందికి పైగా హాజరయ్యారు. ఈ కార్యక్రమం నిర్వహించిన ఏ ప్రసాద్ రాష్ట్ర సంఘం కోశాధికారి, జిల్లా ఉద్యోగుల సంఘం కార్యదర్శిని అందరూ అభినందించారు. ఈ కార్యక్రమం జరిగిన విదానము చూసిన ఎక్కువమంది ప్రస్తుతం పనిచెయుచున్న కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి రాబోవు రోజులలో ఇదే విధానం కొనసాగించి అందరి మన్నలను పొందాలని అందరూ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జి వి శివారెడ్డి, డి కోటేశ్వరరావు, జిల్లాలోని గ్రంథపాలకులు హాజరయ్యారు. కార్యక్రమంలో అందరికి జీపీఎఫ్ చెక్కులు అందించారు. కార్యక్రమం విజయవంతం కావటం పట్ల అందరూ సంతోషం వ్యక్తం చేశారు.

# వ్యాధుల పై విద్యార్థులకు అవగాహన





**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 5)**

డెంగీ, డయేరియా, సికిల్ సెల్ అనీమియా వ్యాధుల గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. పొదిలి కెజిబివిలో విద్యార్థినులకు డాక్టర్ శరత్ చంద్ర ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# బార్క్యాస్ హెూటల్‌లో అగ్నిప్రమాదం

### సకాలంలో స్పందించి

### మంటలను అదుపు చేసిన సిబ్బంది

### తప్పిన ప్రమాదం





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 5)**

ఒంగోలు నగరం కర్నూల్ రోడ్‌లోని బార్క్యాస్ హెూటల్‌లో బ్రోయర్ తగలబడి పొగలు వ్యాపించాయి. సాగర్ హెూటల్ సెంటర్ నుండి కర్నూల్ కూడా అద్దంకి బస్టాండ్ వరకు పూర్తిగా దట్టమైన పొగ కమ్మటంతో ఏం జరిగిందో తెలియక ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. బార్క్యాస్ లోని బ్రోయర్ షార్ట్ సర్క్యూట్ కావడంతో అది పూర్తిగా కాలిపోయి పొగలు వ్యాపించాయి. నిర్వాహకులు స్పందించి లోపల మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక శాఖ వాహనం వచ్చినప్పటికీ అప్పటికే లోపల మంటలను అదుపు చేశారు.






On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL 16448. e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com